

విజయవంతమైన ఆపరేషన్ స్మైల్

- చిన్నారుల జీవితాల్లో వెలుగు నింపడమే లక్ష్యం
- జిల్లా చైల్డ్‌వెల్ఫేర్ కమిటీ చైర్ పర్సన్ ధనలక్ష్మి

కరీంనగర్ క్రైం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త నిర్వహణలో తెలంగాణ మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జనవరి 1 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించిన ఆపరేషన్ స్మైల్-11 కార్యక్రమం కరీంనగర్‌లో విజయవంతంగా ముగిసిందని కరీంనగర్ జిల్లా చైల్డ్‌వెల్ఫేర్ కమిటీ (సీడబ్ల్యూసీ) చైర్ పర్సన్ ధనలక్ష్మి అన్నారు. పోలీసు, లేబర్, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, సమగ్ర బాలల పరిరక్షణ పథకం (ఐసీపీఎస్), స్వచ్ఛంద సంస్థల సహకారంతో బాల కార్మికులు లేని జిల్లాగా మార్చడమే లక్ష్యంగా కొనసాగుతున్నట్లు తెలిపారు. కమిటీ సభ్యులు రేండ్ల కళింగ శేఖర్, కే.విజయ్ కుమార్, రాధ, అర్చన రెడ్డిలతో కలిసి శుక్రవారం కరీంనగర్ బాలరక్ష భవన్‌లో ఆమె మాట్లాడారు.



మాట్లాడుతున్న జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్ పర్సన్ ధనలక్ష్మి

తెలంగాణ రాష్ట్ర మహిళా శిశు సంక్షేమశాఖ జిల్లా కలెక్టర్ ఆదేశాను సారం సమగ్ర బాలల పరిరక్షణ పథకం, చైల్డ్ లైన్1098, పోలీస్, లేబర్, రెవెన్యూ, విద్యా మొదలగు శాఖల సహకారంతో ప్రత్యేక బృందాలుగా ఏర్పడి జిల్లాలోని 16 మండలాల్లో మూడు విభాగాలుగా, కరీంనగర్ రూరల్,కరీంనగర్ అర్బన్, హుజూరాబాద్ మూడు టీంలను ఏర్పాటు చేశామన్నారు. నెల రోజులపాటు విస్తృతంగా తనిఖీలు నిర్వహించామన్నారు. జిల్లాలో ఈ రోజు వరకు మొత్తం 39 మంది పిల్లలను రెస్క్యూ చేశామన్నారు. ఇందులో 37 మంది బాలురు, 2 బాలికలున్నారని తెలిపారు. కరీంనగర్ అర్బన్ -12, కరీంనగర్ రూరల్-8, హుజురాబాద్-19 ప్రాంతాల్లో 39 మంది పిల్లలను రెస్క్యూ చేయడంతో పాటు చైల్డ్‌వెల్ఫేర్ కమిటీ పిల్లలకు కౌన్సిలింగ్ చేసినట్లు తెలిపారు. హోటళ్ల, దాబాల్లో, క్వారీల్లో, రహదారి నిర్మాణాల్లో, దుకాణాలలో పిల్లలు పనిచేస్తున్నారని అన్నారు. తెలంగాణతో పాటు వివిధ రాష్ట్రాలలో మొత్తం 39 మందిని కాపాడి వారి ప్రాంతాలకు పంపించి, పాఠశాలలో చేర్పించేలా చర్య తీసుకున్నామన్నారు.

కేంద్ర బడ్జెట్‌పై ఆశలు

- కొత్తపల్లి-మనోహరాబాద్‌కు మోక్షం కలిగేనా..!
- కరీంనగర్-హసన్‌పర్తి పనులు ప్రారంభానికి నోచుకునేనా..!
- ఆదాయ పన్ను పరిధి పెంపుపై ఆశలు



కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలాసీతారామన్ ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టే బడ్జెట్‌పై జిల్లా ప్రజలు ఆశలు పెట్టుకున్నారు. సంవత్సరాలుగా సాగుతున్న రైల్వే విస్తరణ పనులు వేగవంతం కావాలని కోరుతున్నారు. ఆదాయ పన్ను మినహాయింపు పరిధిని రూ. 7 లక్షల నుంచి 10 లక్షలకు పెంచి వేతన జీవులు, మధ్యతరగతి ప్రజలకు ఊరట కల్పించాలని కోరుతున్నారు. ఈ ప్రాంతంలోని పరిశ్రమల ఉత్పత్తులపై పన్నులు తగ్గించాలని కోరుకుంటున్నారు.

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

ఉత్తర తెలంగాణలో వేగంగా అభివృద్ధి చెందుతున్న కరీంనగర్ జిల్లా రైల్వే సౌకర్యాల విస్తరణలో వెనుకబడి ఉంది. రాష్ట్రంలో ద్వితీయ నగరంగా రూపుదాల్చుతున్న జిల్లా కేంద్రం ఇప్పటికే విద్య, వైద్య రంగాలలో అగ్రగామిగా నిలుస్తుండగా ఐటీ, టూరిజం రంగాలకు అత్యధిక అవకాశాలున్నాయి. జిల్లా కేంద్రంతో పాటు జిల్లా మొత్తంగా అభివృద్ధి మరింత వేగవంతం కావాలంటే రైల్వే శాఖ కొత్త రైలు మార్గాల నిర్మాణం చేపట్టడం, పాత మార్గాల పనులు త్వరితగతిన పూర్తి చేయడం, లైన్ల డబ్లింగ్, ఓవర్ బ్రిడ్జీల నిర్మాణం, స్టేషన్ల ఆధునికీకరణ చేపట్టాల్సిన అవసరమున్నది. సంవత్సరాలుగా సాగుతున్న రైల్వేలైన్ల విస్తరణ పనులు వేగవంతం కావాలని ప్రజలు కోరుకుంటున్నారు.

కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలాసీతారామన్ ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టే బడ్జెట్‌లో జిల్లా రైల్వే ప్రాజెక్టులకు పెద్దపీట వేస్తారని జిల్లా ప్రజలు ఆశలు పెట్టుకున్నారు. కేంద్రహోంశాఖ సహాయ మంత్రిగా జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న బండి సంజయ్ కుమార్ రైల్వే విస్తరణ పనులపై పలు మార్లు రైల్వే శాఖ మంత్రిని కలిసి ప్రతిపాదనలు ఉంచిన నేపథ్యంలో ఫిబ్రవరి 1న శనివారం ప్రవేశ పెట్టనున్న కేంద్ర బడ్జెట్‌లో నిధుల కేటాయింపులో జిల్లాకు ప్రాధాన్యత లభిస్తుందని జిల్లా ప్రజలు ఆశిస్తున్నారు.

కరీంనగర్-తీగలగుట్టపల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు పూర్తయ్యేనా...

సేతు బంధన్ పథకం కింద రూ.154 కోట్ల అంచనా బడ్జెట్‌తో చేపట్టిన కరీంనగర్- తీగలగుట్టపల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు మందకొడిగా సాగుతున్నాయి. ఓవర్ బ్రిడ్జి నిర్మించే రోడ్డును తవ్వేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రైళ్లు వచ్చినపుడు గేట్లు మూసివేయడంతో ఇరువైపులా కిలోమీటరు మేర ట్రాఫిక్ నిలిచిపోయి అరగంటపాటు వేచిచూడాల్సి వస్తున్నది. ఈ బ్రిడ్జి నిర్మాణ పనులను వేగవంతం చేయడంతోపాటు 46 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనులు కూడా పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు. కరీంనగర్ నుంచి సంవత్సరం పొడవునా కాకినాడ పోర్టుకు గ్రానైట్ రవాణా జరుగుతుంది. ఇక్కడి నుంచి చైనాకు, ఇతర దేశాలకు సముద్ర మార్గంలో గ్రానైట్ తరలిస్తున్నారు. కరీంనగర్ - కొత్తపల్లి రైల్వే స్టేషన్లలో ఎక్కువ లైన్లను నిర్మించి గ్రానైట్, ఎరువులు, ఇతర వస్తువుల రవాణాకు ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రజలు, వ్యాపారులు కోరుకుంటున్నారు.

కరీంనగర్- హసన్‌పర్తి మార్గంపై ఆశలు

కరీంనగర్ నుంచి వరంగల్‌కు నేరుగా రైలు రవాణా సౌకర్యాన్ని కల్పించే కరీంనగర్- హసన్ పర్తి మార్గం ప్రతిపాదన ప్రాథమిక దశ లోనే ఉంది. ఫైనల్ లోకేషన్ సర్వే మాత్రమే ఇప్పటి వరకు పూర్తి చేశారు. ఈ రైలు మార్గానికి 1300 కోట్ల రూపాయలు అవసరమవుతాయని అంచనా వేసి రైల్వే బోర్డు అనుమతి కోసం పంపించగా ఆ ఫైలుకు మోక్షం లభించడం లేదు. ఈ సంవత్సరం రైల్వే బోర్డు అనుమతి ఇప్పించి, బడ్జెట్ ప్రతిపాదనలు చేయాలని ప్రజలు ఆశిస్తున్నారు.

కొత్త రైళ్లపై ఆశలు

కరీంనగర్-సికింద్రాబాద్, కరీంనగర్-విజయవాడ మధ్య ప్రస్తుతం ఉన్న పెద్దపల్లి మార్గం మీదుగా వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలును నడిపించాలని ప్రజలు కోరుతున్నారు. కరీంనగర్-తిరుపతి ఎక్స్‌ప్రెస్‌ను ప్రతి రోజూ నడిపించాలని, విశాఖ-షిరిడీ మధ్య నడిచే సాయి నగర్ వీక్లీ ఎక్స్‌ప్రెస్‌ను పెద్దపల్లి-కరీంనగర్ మీదుగా మళ్లించాలని ప్రజలు కోరుతున్నారు.

కొత్తపల్లి-మనోహరాబాద్‌ను ఈ బడ్జెట్‌తో పూర్తిచేయండి

కరీంనగర్ నుంచి రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు నేరుగా రైలు సౌకర్యం కల్పించేందుకు 2016 జూలై 21న కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిన కొత్తపల్లి-మనోహరాబాద్ 151.34 కి.మీ. రైల్వే లైను నిర్మాణం తొమ్మిదేళ్లుగా కొనసాగుతూనే వస్తున్నది. ఇప్పటి వరకు 1400 కోట్ల రూపాయలు వెచ్చించి కేవలం 76.135 కి.మీ. పనులు మాత్రమే పూర్తిచేశారు. 75 కి.మీ. పనులు ఇంకా పూర్తిచేయాల్సి ఉన్నది. గత బడ్జెట్‌లో 350 కోట్ల రూపాయలు మంజూరు చేశారు. గడిచిన సెప్టెంబరు నాటికి సిద్దిపేట నుంచి సిరిసిల్ల వరకు 30 కి.మీ. రైలు మార్గం పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నా అది కార్యరూపం దాల్చలేదు. సిరిసిల్ల నుంచి కొత్తపల్లి వరకు 38.6 కి.మీ. రైల్వే ట్రాక్ పనులు పూర్తి చేయాల్సి ఉన్నది. ఈ సంవత్సరం బడ్జెట్‌లో అత్యధిక నిధులు కేటాయించడమే కాకుండా ఏడాదిలోగా ఈ లైన్ నిర్మాణ పనులు పూర్తిచేసేలా బడ్జెట్ ప్రతిపాదనలు ఉండాలని ప్రజలు కోరుకుంటున్నారు.

మిగతా 6వ పేజీలో

ఎమ్మెల్సీ ఓటరు నమోదు దరఖాస్తులను పరిష్కరించాలి

కలెక్టర్, ఎన్నికల అధికారి పమేలా సత్పతి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పమేలాసత్పతి

కరీంనగర్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): శాసనమండలి సభ్యుల ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళిని కట్టుదిట్టంగా అమలుచేయాలని, ఫిబ్రవరి 7వ తేదీలోగా పట్టభద్రుల, టీచర్ ఎమ్మెల్సీ ఓటరు దరఖాస్తులన్నిటినీ పరిష్క రించాలని జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆమె ఉమ్మడి జిల్లా పరిధిలోని అదనపు కలె క్టర్లతో టెలీ కాన్ఫరెన్సు ద్వారా ఎమ్మెల్సీ ఎన్నికలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నియమావళికి సంబం ధించి 24 గంటలు, 48 గంటలు, 72 గంటల్లో తీసుకోవలసిన చర్యలపై రిపోర్టు అందించాలని అన్నారు.

రాజకీయపార్టీలకు సంబంధించిన హోర్డింగ్‌లు, గోడరాతలు, జెండాలు, ప్రకటనలను తొలగించాలని అన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి అకౌంటింగ్ బృందాలు, ఎంసీసీ బృందాలు, ఫ్లయింగ్ స్క్వాడ్, ఎస్‌ఎస్‌టి, వీవిటి తదితర బృందాలను వెంటనే ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మండలాల్లో ఈ రోజు వరకు ఓటరు నమోదు కోసం వచ్చిన దరఖాస్తులను పరిగణలోకి తీసుకోవాలని మొత్తం దరఖాస్తులను ఫిబ్రవరి 7వ తేదీలోగా పరిష్కరించాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్లు పరిశీలించాలని, ప్రచారానికి అవసరమైన అనుమతులను నిబంధనల ప్రకారం జారీ చేయాలని అన్నారు. ఎన్నికల సిబ్బందికి అవసరమైన శిక్షణ అందించేందుకు మాస్టర్ ట్రైనర్లను ఎంపిక చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లక్ష్మీకిరణ్, ప్రఫుల్ దేశాయ్, డీఆర్వో వెంకటేశ్వర్లు, ఇతర ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణ మాత్రలు అందించాలి

సుభాష్‌నగర్: నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఫిబ్రవరి 10న నులిపురుగుల నివారణ మాత్రలు అందించాలని జిల్లా కలెక్టర్ పమేలాసత్పతి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ కాన్ఫరెన్స్ హాలులో స్థానిక అదనపు కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్‌తో కలిసి వైద్యాధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చదివే పిల్లలతోపాటు కూలీల పిల్లల వివరాలతో జాబితా తయారు చేసి మాత్రలు అందించాలన్నారు. మోతాదు ప్రకారం అల్బెండజోల్ మాత్రలు మింగిన వారి వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. వైద్య సిబ్బంది క్షేత్ర స్థాయిలో తిరుగుతూ నులిపురు గుల నివారణ మాత్రలు తీసుకోకుంటే కలిగే నష్టాలను అన్ని విద్యాసంస్థల్లో వివరిం చాలని సూచించారు. విద్యార్థులు తరుచూ చేతులు కడుక్కోవడం, గోర్లు కత్తిరించుకోవడంపై కూడా అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ సాజిదాఅతహరి, డీడబ్ల్యూవో సబిత, బీసీ సంక్షేమ అధికారి అనిల్‌ప్రకాశ్, వైద్యాధికారులు పాల్గొన్నారు.


కబడ్డీ ఫైనల్ మ్యాచ్‌లో తలపడుతున్న పోలీసు క్రీడాకారులు

ఉత్సాహం నింపిన పోలీస్ క్రీడలు
- పోటాపోటీగా నాల్గవ రోజు ఆటలు
- నేడు ముగింపు
- హాజరుకానున్న డీజీపీ డాక్టర్ జితేందర్
5


హుజూరాబాద్ ఆర్డీవో కార్యాలయంలో ఫిర్యాదు చేసేందుకు వచ్చిన వృద్ధులు (ఫైల్)

పట్టించుకునే వారు లేక..
- తప్పని పరిస్థితుల్లో అధికారులను ఆశ్రయిస్తున్న వృద్ధులు
- వారసులకు కౌన్సెలింగ్ ఇస్తున్న అధికారులు
- హుజూరాబాద్ డివిజన్ పరిధిలో 46 ఫిర్యాదులు
4

కరీంనగర్ జిల్లా జైలు సూపరింటెండెంట్‌గా విజయ్‌డేని



కరీంనగర్ క్రైం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా జైలు సూప రింటెండెంట్‌గా విజయ్‌డేని శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన జైలు సూపరింటెండెంట్ కె శ్రీనివాస్ పదవీ విర మణ పొందారు. ఉమ్మడి వరంగల్ జిల్లా సబ్ జైళ్ల అధికారిగా పనిచేస్తున్న విజయ్‌డేనిని కరీంనగర్ జైలు సూపరింటెండెంట్‌గా బదిలీ చేశారు. గతంలో ఆయన జిల్లా జైలర్‌గా కరీంనగర్‌లో పనిచేసి అధికారుల నుంచి ప్రశంసలు అందుకున్నారు. కాగా ప్రస్తుత జైలు సూపరింటెండెంట్ కె శ్రీనివాస్ శుక్రవారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఆయనను జైళ్లశాఖ వరంగల్ రేంజీ డీఐజీ ఎం సంపత్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. సూపరింటెండెంట్ విజయ్‌డేనిని డీఐజీ అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు.

జైలును సందర్శించిన డీఐజీ

జిల్లా జైలును జైళ్లశాఖ వరంగల్ రేంజి డీఐజీ ఎం సంపత్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా జైలులో ఏర్పాటు చేసిన గౌతమి బుద్ధుడి విగ్రహాన్ని డీఐజీ ఆవిష్కరించారు. జైలులో నూతనంగా ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్ గదిని ప్రారంభించారు. అనంతరం జైలులోని ఖైదీల యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. జైలులోని క్యాంటీన్, ఆసుపత్రి, ములాఖత్‌గది, ఫోన్ సౌకర్యం, లైబ్రరీ, వంటశాల, ఇండస్ట్రీ, పెట్రోల్‌బంక్ పనితీరును డీఐజీ ఎం సంపత్ పరిశీలించారు. ఈ కార్యక్రమాల్లో జైలు వైద్యాధికారి కె వేణుగోపాల్, జైలర్స్ ఏ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ సుధాకర్‌రెడ్డి, ఎల్ రమేష్, దేవేందర్, అజయ్‌చారి, సిబ్బంది పాల్గొన్నారు.


బుద్దుడి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న జైళ్లశాఖ డీఐజీ ఎం సంపత్

అల్ఫోర్స్ చైర్మన్ నరేందర్‌రెడ్డికే కాంగ్రెస్ ఎమ్మెల్సీ టికెట్

- ప్రకటించిన అధిష్ఠానం
- ఇక ముమ్మరం కానున్న ప్రచారం



కరీంనగర్, జనవరి 31 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): కరీంనగర్- మెదక్- నిజామాబాద్-ఆదిలాబాద్ జిల్లాల పట్టభద్రుల స్థానానికి అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ వి నరేందర్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే డాక్టర్ వి నరేందర్‌రెడ్డి అభ్యర్థిత్వాన్ని ఆమోదించగా, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణు గోపాల్ ప్రకటన జారీ చేశారు. కరీంనగర్-మెదక్-నిజామాబాద్- ఆదిలాబాద్ ఎమ్మెల్సీ స్థానానికి ఈ నెల 27వ తేదీన ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను ప్రకటించింది. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ ఎంపిక విషయంలో తర్జన భర్జన పడి చివరకు నరేందర్‌రెడ్డి అభ్యర్థిత్వం వైపే మొగ్గుచూపింది.

పదవీ కాలం మార్చి 29తో ముగియనుండగా పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. షెడ్యూల్ విడుదలైన వెంటనే కాంగ్రెస్ పార్టీ తాత్సారం ప్రదర్శించ కుండా కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసింది. అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత నరేందర్‌రెడ్డి మొదటి నుంచి కాంగ్రెస్ టికెట్ తనకే వస్తుందన్న ధీమాతో నాలుగు ఉమ్మడి జిల్లాల్లో ప్రచార పర్వాన్ని కొనసాగిస్తున్నారు. ఫిబ్రవరి నెలలో ఎన్నికలు జరుగుతాయని తెలుసుకుని నాలుగు నెలల నుంచే అన్ని వర్గాల మద్ధతు మూట గట్టుకుంటూ ప్రచా రాన్ని కొనసాగించారు. నాలుగు జిల్లాల్లో పెద్ద ఎత్తున ఓటర్ల నమోదు ప్రక్రియను చేపట్టి ప్రచార పర్వంలో కొనసాగారు. ఇప్పటికే నాలుగు జిల్లాలోని పట్టభద్రులను కలిసి వచ్చారు. జిల్లాల్లోని తనకు ఉన్న సంబంధాలు కళాశా లల యాజమాన్యాల వారితో సంప్రదింపులు జరిపి పట్టభద్రులు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లోకి వెళ్లి వారి ఓట్లను అభ్యర్థించారు.

ఇప్పటికే పట్టభద్రులను ప్రసన్నం చేసుకునే పనిలో ఉన్నారు. కాంగ్రెస్ అధిష్ఠానం అన్ని బేరీజు వేసుకుని నరేందర్‌రెడ్డి అభ్యర్థిత్వానికే మొగ్గుచూపింది. ఎమ్మెల్సీ నియోజకవర్గం నాలుగు ఉమ్మడి జిల్లాల్లో విస్తరించి ఉన్నా కరీంనగర్ జిల్లాలోనే పట్టభద్రులు ఎక్కువగా ఉన్నారనే అంచనాలతో కరీంనగర్‌కు చెందిన నరేందర్‌రెడ్డినే అభ్యర్థిగా ప్రకటించినట్లు చర్చ జరుగుతోంది. అధిష్ఠానం అన్ని విషయాలను పరిగణనలోకి తీసుకుని కాంగ్రెస్ నాయకులతో సంప్రదింపులు జరిపి బలమైన అభ్యర్థిగా నరేందర్‌రెడ్డిని బరిలోకి దింపినట్లు సమాచారం. అభ్యర్థిగా ప్రకటించడంతో ఎన్నికల ప్రచారం ముమ్మరం చేయనున్నారు.

స్కాలర్‌షిప్, ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలి

కరీంనగర్ టౌన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): స్కాలర్‌షిప్, ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కుతాటి రాణాప్రతాప్ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లాకేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యు) జిల్లా ముఖ్యకార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగం పట్ల పూర్తిగా నిర్లక్ష్యం చూపుతోందన్నారు. ఐదు సంవత్సరాల నుంచి పేద విద్యార్థులకు న్యాయబద్ధంగా రావలసిన స్కాలర్‌షిప్‌లను విడుదల చేయకపోవడంతో పేద విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ప్రైవేట్ యాజమాన్యాలు బలవంతంగా ఫీజులు వసూలు చేస్తూ వేధింపులకు గురిచేస్తున్నాయని విమర్శించారు. కేవలం ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిపులపై ఆధారపడ్డ ప్రైవేట్ డిగ్రీ కలాశాలలు మూసి వేసుకుంటున్నారని అన్నారు. ఇప్పటికే ఇంటర్ విద్య కార్పొరేటర్ సంస్థల ఆధీనంలోకి వెళ్లిందని, డిగ్రీ విద్య కూడా అదే స్థితికి చేరుకునే ప్రమాదముందన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు కెంసారపు రవితేజ, జిల్లా నాయకులు ఎండి అస్లాం, కొయ్యడ బాబు, రాకేశ్, అజయ్, చందు, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన వృద్ధురాలు మృతి



పద్మ (ఫైల్)

ఎల్లారెడ్డిపేట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఈనెల 19న వంట చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు నిప్పంటుకుని తీవ్ర గాయాలపాలైన వృద్ధురాలు బొమ్మకంటి పద్మ(76) స్థానిక ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందింది. స్థానికులు తెలిపినవివరాల ప్రకారం.. గ్రామంలోని తనఇంటిలో పద్మ ఒంటరిగా నివసిస్తోంది. వంటచేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు చీర అంటుకుంది. మంటల్లో చిక్కుకున్న ఆమె కేకలు వేయడం వల్ల చుట్టుపక్కల వారు గమనించి కాపాడారు. అప్పటికే ఆమె తీవ్ర గాయాలపాలైంది. సమాచారం అందుకున్న కుమారులు, బంధువులు పద్మను స్థానిక ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది.

బైక్‌పై నుంచి పడి మహిళ..



భారతి (ఫైల్)

చొప్పదండి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): చొప్పదండి పట్టణశివారులో బైక్‌పై నుంచి కిందపడి మహిళ మృతిచెందిన సంఘటన శుక్రవారం జరిగింది. ఎస్‌ఐ అనూష కథనం ప్రకారం.. జగిత్యాల జిల్లా ధర్మపురికి చెందిన పసుపునుటి భారతి(60) నగునూరులోని ప్రైవేట్ ఆసుపత్రికి బైక్‌పై వెళ్తోంది. బైక్‌ను కుమారుడు చంద్రశేఖర్ నడుపుతుండగా నవోదయ శివారులో మేకపిల్ల అడ్డువచ్చింది. చంద్రశేఖర్ తన బైక్‌ను అకస్మాత్తుగా నిలిపివేయగా వెనుకాల కూర్చున్న భారతి కిందపడింది. ఈప్రమాదంలో ఆమె తలకు బలమైన గాయాలయ్యాయి. చికిత్స కోసం వెంటనే ఆమెను 108లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. భారతి కుమారుడు పుసుపునూటి రాజశేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ అనూష తెలిపారు.

స్వగ్రామం చేరిన మృతదేహం



మల్లేష్ (ఫైల్)

వేములవాడ టౌన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కోసం దుబాయి దేశం వెళ్లిన వ్యక్తి మృతదేహం శుక్రవారం స్వగ్రామం చేరింది. వేములవాడ పట్టణం తిప్పాపూర్ గ్రామానికి చెందిన గుడిసె మల్లేష్ (40) 18 నెలల క్రితం దుబాయి దేశం వెళ్లాడు. గత సంవత్సరం డిసెంబర్ 24వ తేదీన కూలిపని చేస్తుండగా ఇసుకదిబ్బ కూలి ప్రమాదవశాత్తు మృతిచెందాడు. దీంతోమృతదేహం శుక్రవారం స్వగ్రామం చేరడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. మృతుడికి భార్య ప్రమీల, కూతురులు కీర్తన, సాత్వికప్రియతో పాటు కుమారుడు ఉన్నాడు. మల్లేష్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.

పురుగులమందు తాగి యువకుడి ఆత్మహత్య

ఎలిగేడు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన గోసిక అంజయ్య (29) అనే యువకుడు పురుగులమందు తాగి చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. జూలపల్లి ఎస్సై సనత్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. అంజయ్య మద్యానికి బానిసై రోజూ ఇంట్లో గొడవచేసేవాడు. అదే క్రమంలో ఈనెల 29న పురుగుల మందు తాగాడు. గమనించిన బంధువులు కరీంనగర్‌కు అక్కడినుంచి హైదరాబాద్‌కు గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతిచెందాడు. మృతుడు అంజయ్య సోదరుడు గోసిక శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సనత్‌కుమార్ తెలిపారు.

పట్టించుకునే వారు లేక..

- తప్పని పరిస్థితుల్లో అధికారులను ఆశ్రయిస్తున్న వృద్ధులు
- వారసులకు కౌన్సెలింగ్ ఇస్తున్న అధికారులు
- హుజూరాబాద్ డివిజన్ పరిధిలో 46 ఫిర్యాదులు



హుజూరాబాద్ ఆర్డీవో కార్యాలయంలో ఫిర్యాదు చేసేందుకు వచ్చిన వృద్ధులు (ఫైల్)

హుజూరాబాద్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): జీవితం చరమాంకంలో ఉన్న వృద్ధులను వారి పిల్లలు పట్టించుకోకపోవడంతో వారు అధికారులను ఆశ్రయిస్తున్నారు. బాల్యంలో తమ బాగోగులను చూసి భవిష్యత్తును బంగారు మయం చేసి భరోసా కల్పించిన తల్లిదండ్రులను వృద్ధాప్యంలో నిర్లక్ష్యం చేస్తున్నారు. మరికొందరు తల్లిదండ్రులను అనాథ శరణాలయాలు, వృద్ధాశ్రమాలకు పంపిస్తున్నారు. దయనీయ స్థితిలో ఉన్న తల్లిదండ్రులపై చేయి చేసుకొని సభ్య సమాజం తల దించుకునేలా వ్యవహరిస్తున్నారు. వీటన్నిటికి విరుగుడు చూపిస్తూ 2005లో అప్పటి ప్రభుత్వం రెవెన్యూ శాఖ ద్వారా సీనియర్ సిటిజన్ యాక్టు తీసుకువచ్చింది. వృద్ధ తల్లిదండ్రులపై కఠినంగా వ్యవహరించే వారసులకు హెచ్చరికలు జారీ చేసింది.

● తల్లిదండ్రులపై పెరుగుతున్న దాడులు

నేటి సమాజంలో రోజు రోజుకు వృద్ధ తల్లిదండ్రులపై దాడులు పెరిగిపోతున్నాయి. కళ్ల ముందే కొన్ని సంఘటనలు జరుగుతుంటే మాకేందుకులే అని సమాజం పట్టించుకోవడం లేదు. వృద్ధ తల్లిదండ్రుల స్థిర, చిరాస్థులను తమ పేర్లపై మార్చుకుని వారిని పట్టించుకోవడం లేదు. పైగా దాడులు చేస్తున్నారు. 2005లో సీనియర్ సిటిజన్ యాక్టు వచ్చినా దాని గురించి పెద్దగా ప్రచారం లేదు. ఇటీవల సీనియర్ సిటిజన్ యాక్టుపై విస్తృత ప్రచారం జరుగుతుంది. వృద్ధ తల్లిదండ్రులను పోషించకపోయినా, వారిపైన దాడులు చేసినా చట్టం అటువంటి వారిని శిక్షిస్తుంది. సీనియర్ సిటిజన్ యాక్టు ప్రకారం వ్యవసాయ భూములు, ప్లాట్లు, ఇళ్ల పట్టాలు చేసుకున్న తర్వాత వృద్ధ తల్లిదండ్రుల బాగోగులు పట్టించుకోకపోతే ఆ పట్టాను



హుజూరాబాద్ ఆర్డీవో కార్యాలయం

రద్దు చేసి తిరిగి తల్లిదండ్రులకే ఆ భూములు చెందేలా చేయవచ్చు ఉద్యోగాలు చేసే పిల్లలు తల్లిదండ్రులను పట్టించుకోకపోతే వారి వేతనం నుంచి 10వేల రూపాయలు ఇచ్చే వెసులుబాటు ఉంది. ఇవి తహసీల్దార్, ఆర్డీవో, కలెక్టర్ పరిధిలోకి వస్తాయి.

● కౌన్సెలింగ్ ఇస్తున్న అధికారులు

డివిజన్‌లోని జమ్మికుంట, హుజూరాబాద్, ఇల్లందకుంట, వీణవంక, సైదాపూర్, శంకరపట్నం మండలాల్లోని సీనియర్ సిటిజన్ యాక్టు గురించి తెలుసుకున్న 46 మంది వృద్ధులు ఆర్డీవో రమేష్‌బాబుకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేయగానే అధికారులు వారి వారసులను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. వినని వారిని స్థిరాస్తులు మార్పులు చేస్తామని హెచ్చరిస్తున్నారు. దీంతో ఇప్పటి వరకు వచ్చిన 46 ఫిర్యాదుల్లో 33 పరిష్కారమయ్యాయి. 13 కేసులు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని ఆర్డీవో రమేష్ బాబు తెలిపారు. ఉద్యోగులు కూడా తమ తల్లిదండ్రుల బాగోగులు చూసుకోవడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయని అధికారులు పేర్కొంటున్నారు.

భార్యను హత్యచేసిన కేసులో జీవిత ఖైదు

కమాన్‌పూర్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్‌కు చెందిన కోల తిరుపతికి భార్యను చంపిన కేసులో గోదావరిఖనిజిల్లా ఆరో సెషన్స్‌కోర్టు న్యాయమూర్తి డాక్టర్ టి శ్రీనివాసరావు జీవతఖైదు విధించారు. కమాన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జూలపల్లి గ్రామానికి చెందిన కోల స్వరూపను ఆమె భర్త కోల తిరుపతి 2020నవంబర్ ఆరవతేదీన గొంతునులిమి హత్య చేశాడు. ఈ మేరకు మృతురాలు స్వరూప తమ్ముడు కన్నం రాజేందర్ ఫిర్యాదు మేరకు అప్పటి కమాన్‌పూర్ ఎస్సై పి శ్యామ్‌పటేల్ కేసు నమోదుచేశారు. అప్పటి గోదావరిఖని 2వపట్టణ సీఐ కె లక్ష్మీనారాయణ దర్యాప్తు చేసి నివేదికను కోర్టులో సమర్పించారు. పబ్లిక్‌ప్రాసిక్యూటర్ టి జ్యోతిరెడ్డి సాక్షులను ప్రవేశపెట్టగా విచారణ అనంతరం గోదావరిఖని సెషన్‌కోర్టు న్యాయమూర్తి టి శ్రీనివాసరావు నిందుతునికి జీవితఖైదుతో పాటు, 1000రూపాయలు జరిమానా విధించారు.

రైలునుంచి పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

ఓదెల, జనవరి 31(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఓదెల రైల్వేస్టేషన్‌లో గోరఖ్‌పూర్ ఎక్స్‌ప్రెస్ రైలునుంచి ప్రమాదవశాత్తు రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. గోరఖ్‌పూర్ నుంచి తిరువనంతపురం కొచ్చి వైపువెళ్లే రైలు బోగీలో ఉన్నవ్యక్తి రైలునడుస్తున్న సమయంలో మరోబోగీ ఎక్కే ప్రయత్నంలో రైలు ప్లాట్‌ఫాం మధ్య పడి మృతిచెందాడు. మృతుడు బ్లూ కలర్ చొక్కా, నల్లటి ప్యాంట్ ధరించి ఉన్నాడు . అతని వద్ద సెల్ ఫోన్ లభించినట్టు రైల్వే అధికారులు తెలిపారు.

వనం వీడి.. జనంలోకి నెమలి



గంభీరావుపేటలోకి వచ్చిన నెమలి

గంభీరావుపేట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : వనం వీడి ఓ వన్యప్రాణి జనంలోకి వచ్చింది. అడవుల్లో పంట పొలాల్లో సంచరించే నెమలి ఊళ్లోకి వచ్చింది. గంభీరావుపేట గాంధీ చౌక్ నుంచి లింగన్నపేట వెళ్లే ప్రధాన రహదారిలో అనూహ్యంగా నెమలి ప్రత్యక్షమైంది. దీంతో వనంలో ఉండాల్సిన వన్యప్రాణి జనంలోకి రావడంతో స్థానికులు ఆసక్తిగా తిలకించారు. కొన్ని గంటల పాటు నెమలి ప్రధాన రహదారిలో తిరగడంతో ప్రజలు ఆసక్తిగా తిలకించారు.

అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

● 15 మంది ప్రయాణికులకు గాయాలు



గోరంటాల వద్ద అదుపు తప్పి పొలాల్లోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

గంభీరావుపేట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం గోరంటాల గ్రామ సమీపంలోని బ్రిడ్జివద్ద ఏపీ 29జెడ్ 1742నంబర్ గల కామారెడ్డి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు శుక్రవారం అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో 15మందిప్రయాణికులు గాయపడ్డారు. క్షతగాత్రుల్లో కొందరిని కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి, మరికొందరిని సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి చికిత్సకోసం తరలించారు. కామారెడ్డినుంచి 52మంది ప్రయాణికులతో కరీంనగర్ వెళుతున్న ఆర్టీసీబస్సు గోరంటాల గ్రామ సమీపంలోని బ్రిడ్జివద్ద అదుపుతప్పి పక్కనే ఉన్న పొలాల్లోకి దూసుకెళ్లింది. పంటపొలాల్లో ఉన్న రైతులు, గ్రామయువకులు, నాయకులు ప్రమాదస్థలానికి చేరుకుని బస్సులోంచి ప్రయాణికులను కిందకుదించి, అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరళించారు. కామారెడ్డి ఆసుపత్రికిలో ఐదుగురు, సిరిసిల్లఆసుపత్రిలో 10మంది ప్రయాణికులు చికిత్సపొందుతున్నారు. ఎవరికీ ప్రాణాపాయం లేదనితేలడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈప్రమాదంలో కామారెడ్డి, తాడ్వాయి, రెడ్డిపేట, మాచారెడ్డి మండలాలకు చెందినవారు ఉన్నట్టుగా భావిస్తున్నారు. సంఘటనా స్థలానికి కామారెడ్డి డిపో మేనేజన్ ఇందిర, ఎల్లారెడ్డిపేట సీఐ శ్రీనివాస్ గౌడ్, ఎస్‌ఐ శ్రీకాంత్ చేరుకొని ప్రమాదానికి గల కారణాలను అడిగితెలుసుకున్నారు. బ్రేకులు ఫెయిల్ అయ్యి ప్రమాదం జరిగిందా లేక వాహన వేగంలో స్టీరింగ్‌కు లాక్‌పడి ప్రమాదం జరిగిందా తెలియాల్సి ఉంది.

సీఐ అరాచకాలపై న్యాయపరమైన విచారణ జరిపించాలి



సమావేశంలో మాట్లాడుతున్న భాదితులు

జమ్మికుంట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణసీఐ వరంగంటి రవికుమార్‌పై జ్యుడీషియల్ ఎంక్వైరీ జరిపించాలని బాధితులు షేక్ సాబీర్‌అలీ, అంబాల రాజు, కాటిపల్లి లక్ష్మి, కాటిపల్లి సంధ్యారాణి, ఠాగూర్ సుశీల అన్నారు. శుక్రవారం జమ్మికుంటలో మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన పోలీస్ అధికారులను కూడా సీఐ వేధిండన్నారు. జమ్మికుంటలో పనిచేయనివ్వకుండా ఇతరప్రాంతాలకు పంపిస్తున్నాడని ఆరోపించారు. పోలీస్‌స్టేషన్లో ఒక ప్రైవేట్ వ్యక్తి సీఐ గన్‌మెన్‌గా చలామణి అవుతున్నాడన్నారు. అతడికి తోడు హోంగార్డు యాకూబ్ కూడా ఉన్నాడన్నారు. వీరిద్దరూ ఇసుక ట్రాక్టర్ల వద్ద డబ్బులు వసూళ్లు చేస్తారని, డబ్బులు ఇవ్వని ట్రాక్టర్లను స్వాధీనం చేసుకోని స్టేషన్‌కు తీసుకువచ్చి కేసులు పెట్టిస్తున్నారని మండిపడ్డారు. కాటిపల్లి సంధ్యారాణి మాట్లాడుతూ అన్ని విషయాల్లో సీఐని ఏసీపీ శ్రీనివాస్ జీ కాపాడుతున్నారని, ఉన్నతాధికారులు పూర్తిస్థాయి విచారణ జరిపి వారిద్దరిపై చర్యలు తీసుకోవాలన్నారు. లేనిఏడల ప్రజా పాలనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

ఆన్‌లైన్‌లో రమ్మీ ఆడి డబ్బులు పోగొట్టుకున్న యువకుడు

● మనస్థాపంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం ● ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి



బూస కార్తీక్ (ఫైల్)

శంకరపట్నం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ రమ్మీకి అలవాటు పడ్డాడు. లక్షలు సంపాదించవచ్చని భ్రమపడ్డాడు. ఉన్న డబ్బులు పోగొట్టుకుని చివరి ఆత్మహత్యాయ్నం చేసుకోగా శుక్రవారం రాత్రి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచాడు. వివరాల్లోకి వెళితే.. శంకరపట్నం మండలం గద్దపాక గ్రామానికి చెందిన బూస కార్తీక్(25) ఆన్‌లైన్ రమ్మీ ఆటకు అలవాటుపడ్డాడు. దీంతో చేసిన అప్పులకు గతంలోనే తల్లిదండ్రులు అర ఎకరం భూమి అమ్మి ఆ అప్పు తీర్చారు. అయినప్పటికీ కార్తీక్‌లో మార్పు రాలేదు. మళ్లీరమ్మీ ఆటకోసం రూ.2లక్షల వరకు తల్లిదండ్రులకు తెలియకుండా అప్పులు చేసినట్లు సమాచారం. ఆ డబ్బులు కూడా ఆటలో పోగొట్టుకున్నాడు. తల్లిదండ్రులకు విషయం తెలపలేక అప్పు తీర్చే దారిలేక మనస్థాపంతో ఈనెల28న గద్దపాక శివారులోని వాగువద్ద క్రిమిసంహారక మందు తాగాడు. ఈ విషయాన్ని ఫోన్ ద్వారా స్నేహితుడు జక్కుల రాజ్‌కుమార్‌కు తెలిపాడు. రాజ్‌కుమార్ కార్తీక్ తండ్రికి శంకర్‌కు సమాచారం అందించాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు సంఘటన స్థలానికి చేరుకొని కార్తీక్‌ను జమ్మికుంటలోని ఓ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యంకోసం హనుమకొండలోని ఆస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ ఈ నెల30న రాత్రి మృతిచెందాడు. మృతుడి తండ్రి శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కొత్తపల్లి రవి తెలిపారు.

చోరీ కేసులో వ్యక్తి అరెస్ట్

ఎల్లారెడ్డిపేట, జనవరి 31(ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట గ్రామశివారులోని మడేలేశ్వరస్వామి ఆలయం వద్ద ఉన్న విద్యుత్ బోరు మోటారు తీగను అపహరించుకుపోయిన సంఘటనలో గంభీరావుపేట మండలం రాజేశ్వర్‌రావునగర్‌కు చెందిన శివరాత్రి శ్రీనివాస్‌ను అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్‌ఐ రమాకాంత్ శుక్రవారం తెలిపారు. ఆయన కథనం మేరకు.. గ్రామ శివారులోని మడేలేశ్వరస్వామి ఆలయం సమీపంలోని విద్యుత్ బోరు మోటారుతీగను ఈనెల8న గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. ఆలయ కమిటీ చైర్మన్ దీటి నర్సయ్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మండలకేంద్రంలోని రెండవబైపాస్ రోడ్డులో వాహన తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులకు శ్రీనివాస్ కరెంటు తీగతో పట్టుబడ్డాడు. అదుపులోకి తీసుకుని విచారించగా ఆలయం వద్ద ఉన్న బోరు మోటారు తీగను దొంగిలించానని అంగీకరించాడు. నిందితుడి వద్ద నుంచి రూ.8 వేల విలువైన విద్యుత్ తీగను స్వాధీనపర్చుకుని శ్రీనివాస్‌ను రిమాండ్‌కు తరలించామని ఎస్‌ఐ రమాకాంత్ వివరించారు.

రెస్టారెంట్‌లో కార్పొరేషన్ సిబ్బంది తనిఖీలు

కోల్‌సిటీ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని బస్టాండ్ సమీపంలోని ఓ రెస్టారెంట్‌లో శుక్రవారం తనిఖీలు నిర్వహించినట్టు మున్సిపల్ కార్పొరేషన్ వర్గాలు ఒక ప్రకటనలో పేర్కొన్నాయి. కార్పొరేషన్ హెల్త్ అసిస్టెంట్ కిరణ్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ మధుకర్, శానిటేషన్ సిబ్బంది శ్రీకాంత్, శ్రావణ్, ప్రశాంత్ తనిఖీల్లో పాల్గొన్నారు. రెస్టారెంట్‌లో నాణ్యత ప్రమాణాలు పాటించనందున రూ.10వేల జరిమానా విధించినట్టు పేర్కొన్నారు.

గజసింగవరంలో దొంగల బీభత్సం..

● రెండిళ్లలో చోరీ ● రూ.60 వేల నగదు, 2 తులాల బంగారం అపహరణ



డాగ్ స్క్వాడ్‌తో తనిఖీ చేస్తున్న పోలీసులు

గంభీరావుపేట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): రాజన్నసిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం గజసింగవరం గ్రామంలో గురువారం రాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. తాళాలు వేసిన ఇళ్లలోకి దొంగలు చొరబడి నగదుతోపాటు, బంగారం, వెండి వస్తువులను ఎత్తుకెళ్లారు. బాల్‌నర్సు శ్రీకాంత్, బాయిని బాలయ్య ఇళ్ల తాళాలను పగులగొట్టి దొంగతానికి పాల్పడ్డారు. శ్రీకాంత్ తల్లి అనారోగ్యంతో సిద్దిపేటలోని ఓఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. దీంతో శ్రీకాంత్ తన కుటుంబసభ్యులతో కలిసి ఇంటికి తాళంవేసి ఆసుపత్రిలో ఉన్న తల్లి వద్దకు వెళ్లి, గురువారంరాత్రి అక్కడేఉన్నారు. దీంతో శ్రీకాంత్ ఇంటికివేసిన తాళాలను పగులగొట్టి లోనికి చొరబడి బీరువాలోఉన్న 60వేలనగదు, 2తులాల వెండి, నాలుగు పట్టగొలుసుల జతలు దొంగలు ఎత్తుకెళ్లారు. బాయిని బాలయ్య అదే గ్రామంలో కొత్త ఇల్లునిర్మించుకుని పాతఇంటికి తాళం వేశాడు. పాతఇల్లు తాళం పగులగొట్టి దొంగలు చొరబడ్డారు. అయితే ఆ ఇంట్లో ఏమి లేకపోవడంతో నష్టం జరగలేదు. సీఐ శ్రీనివాస్‌గౌడ్, ఎస్‌ఐ శ్రీకాంత్‌లు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. డాగ్ స్క్వాడ్ సిబ్బంది కూడా పరిసరాలను పరిశీలించి వెళ్లారు.

ఎఫ్‌సీఐ గౌతమినగర్‌లో భారీ చోరీ

● తాళం పగులగొట్టి రూ.15లక్షలు ఎత్తుకెళ్లిన దుండగులు

కోల్‌సిటీ, జనవరి 31(ఆంధ్రజ్యోతి): రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఎఫ్‌సీఐ గౌతమినగర్‌లోని ఇనగంటి రాంమోహన్‌రావు అనే సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి ఇంట్లో భారీ చోరీ జరిగింది. అతడిభార్య క్యాన్సర్ చికిత్స నిమిత్తం ఇంటికి తాళంవేసి ఈనెల26న రాంమోహన్‌రావు తన కుటుంబసభ్యులతో హైదరాబాద్‌కు వెళ్లాడు. శుక్రవారం తిరిగివచ్చేసరికి ఇంటి తాళం పగులగొట్టి ఉంది. దొంగలు ఇంట్లోని కబోర్డ్‌లో ఉన్న రూ.15.2లక్షల నగదును ఎత్తుకె ళ్లారు. రెండురోజుల క్రితం చోరీజరిగినట్టు తెలుస్తోంది. భార్య చికిత్సనిమిత్తం ఇటీ వలే గోదావరిఖనిలోని తనప్లాట్ అమ్మగా వచ్చిన నగదును ఇంట్లో పెట్టానని, అత్యవసర చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు వెళ్లినట్టు ఆయన పేర్కొన్నారు.

● బెడ్‌రూమ్ తాళం చెవి ఉండడంతో..

ప్రధానద్వారం తాళం పగులగొట్టి లోనికి చొరబడిన దొంగలు బెడ్‌రూమ్ తాళంతీసి లోనికి వెళ్లారు. బెడ్‌రూమ్ తాళంచేయి అందుబాటులో ఉండడంతో వారికి తాళం పగులగొట్టకుండానే లోనికివెళ్లడం సులు వైంది. ఇతర అభరణాలు కానీ, వస్తువులుకానీ ఎత్తుకెళ్లలేదు.భారీస్థాయిలో నగదు దొరకడంతో దానితో ఉడాయించారు. ఎన్టీపీసీ పోలీసులు, కమి షనరేట్ సీసీఎస్, క్లూస్ టీమ్‌లు ఘటనస్థలంలో పరిశీలించాయి. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న ఎస్‌ఐ ఉదయ్ కిరణ్ తెలిపారు.

తల్లీకూతుళ్ల అదృశ్యం

● కేసు నమోదు



స్రవంతి, శ్రీమోక్ష(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, జనవరి31(ఆంధ్రజ్యోతి):ఎల్లారెడ్డిపేట మండలం అక్కపల్లి గ్రామంలోని బిట్ల స్రవంతి, ఆమె ఐదేళ్లకూతురు శ్రీమోక్షలు అదృశ్యంపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రమాకాంత్ శుక్రవారం తెలిపారు. గ్రామంలోని బిట్ల మల్లేశంభార్య స్రవంతి తన కూతురు శ్రీమోక్షను తీసుకుని ఈనెల 28న చందుర్తిలోని తన తల్లిగారింటికి వెళుతున్నానని ఇంటిలో చెప్పి బయలుదేరారని పేర్కొన్నారు. భార్య, కూతురు చేరుకున్నారో..? లేదోనని అత్తగారింటికి ఫోను చేసిన మల్లేశంకు అక్కడకు రాలేదని తెలిసిందన్నారు. చుట్టుపక్కల, బంధువులవద్దఆరాతీసినా ఆచూకీ లభించలేదని పేర్కొన్నారు. బాధితుడు మల్లేశం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్‌ఐ రమాకాంత్ తెలిపారు.

న్యాయవాది పేరుతో ఘరానా మోసం

● రూ.1.30 కోట్లు వసూలు.. యువకుడి అరెస్ట్



ఫణిధర్

సిరిసిల్ల క్రైం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): న్యాయవాది పేరుతో ఓ వ్యక్తి ఘరానా మోసానికి పాల్పడ్డాడు. సమస్యలు పరిష్కరిస్తానని చెప్పి దాదాపు కోటి 30లక్షల రూపాయలు వసూలు చేశాడు. వచ్చినడబ్బుతో జల్సాలు చేశాడు. బాధితులు సిరిసిల్ల పోలీస్ స్టేషన్‌లో ఇటీవల ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి, సిరిసిల్ల పట్టణం నెహ్రూనగర్‌కు చెందిన ఏనుగు ఫణిదర్ అనే నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. సిరిసిల్ల టౌన్‌సీఐ కే కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. సిరిసిల్ల పట్టణం నెహ్రూనగర్‌కు చెందిన ఏనుగు ఫణిదర్ అనేవ్యక్తి తన సంపాదన సరిపోక శ్రమ లేకుండా పెద్దమొత్తంలో డబ్బులు సంపాదించాలనుకున్నాడు.

గతంలో స్థానికంగా ఓ న్యాయవాది వద్ద క్లర్క్‌గా పనిచేశాడు. ఆ అనుభవంతో భూ, సివిల్ తగాదాలు, లోన్ సమస్యలు, భార్యభర్తల గొడవలు... ఇలా కోర్టుకు సంబంధించిన సమస్యలపై ఎక్కువ డబ్బులు సంపాదించవచ్చని భావించాడు. న్యాయవాది అవతారమెత్తి కోర్టుల్లో కేసులు ఫైల్ చేయడానికి వచ్చే బాధితులతో పరిచయాలు చేసుకుంటూ, తనే న్యాయవాదినని నమ్మించాడు. గతంలో సిరిసిల్ల పట్టణంలోని బడ్స్ అండ్ ఫ్లవర్స్ ప్రైవేట్ స్కూల్ యజమాని కొంటికర్ల వారణాసి కాళిమాతకు సంబం ధించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరులో భూసమస్యను పరిష్కరిస్తానని నమ్మించి 25లక్షల రూపాయలు తీసుకొన్నాడు. సంజీవయ్య నగర్‌కు చెందిన దరిపల్లి సురేష్, అతడి సోదరుడు రమేష్‌లపై ఉన్న చెక్‌బౌన్సు కేసులతో పాటు కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులు పరిష్కరిస్తా నని నమ్మించి, పలు దఫాలుగా మొత్తం రూ.91,52,250 తీసుకున్నాడు. తాజాగా పెద్దూర్‌లోని డబుల్ బెడ్‌రూమ్‌లకు చెందిన విజయలక్ష్మిని నమ్మించి రూ.1.90 లక్షలు తీసుకొన్నాడు. అదేవిధంగా చంద్రంపేటకు చెందిన యెల్ల లలిత భూసమస్య పరిష్కరిస్తానని నమ్మించి ఆమె వద్ద రూ.11.60 లక్షలు వసూలు చేశాడు.

అయితే ఫణిధర్ చేతిలో మోస పోయామని తెలుసుకున్న బాధితులు సిరిసిల్ల టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఇటీవల ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, నిందితుడిని అరెస్ట్ చేసి, సెల్‌ఫోన్‌తో పాటు పలు డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకొని, రిమాండ్‌కు పంపినట్లు పట్టణ సీఐ కృష్ణ తెలిపారు. ఇంకా బాధితులు ఎవరైనా ఉంటే సిరిసిల్ల పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

మధ్యాహ్న భోజనం వికటించి విద్యార్థినులకు అస్వస్థత



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

ధర్మపురి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలోని మైనార్టీబాలికల రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనం వికటించి శుక్రవారం ఐదుగురు విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. మధ్యాహ్నం భోజనం చేసిన అనంతరం జుహా, శ్రావ్య, హుమేరియా, నందిని, కీర్తిమణి అనే ఐదుగురు విద్యార్థులకు కడుపు నొప్పి వచ్చి వాంతులు చేసుకున్నారు. వెంటనే కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కాళ్ల లక్ష్మి చికిత్సకోసం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. బియ్యం సరిగా ఉడుకకపోవడంతో విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని తెలుస్తోంది. విద్యార్థుల తల్లిదండ్రులు సమాచారం అందుకుని హుటాహుటిన ఆసుపత్రికి చేరుకున్నారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి చికిత్సపొందుతున్న విద్యార్థులను పరామర్శించారు. ఆసుపత్రి డాక్టర్ రాముతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులను మెరుగైన చికిత్స కోసం 108 అంబులెన్స్ ద్వారా జగిత్యాల ఆసుపత్రికి పంపించారు. అనంతరం విప్ మాట్లాడుతూ ఘటనకు బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థులను టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల అధ్యక్షులు సంగన భట్ల దినేష్, ఉపాధ్యక్షులు వేముల రాజేష్, జక్కు రవీందర్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు చీపిరిశెట్టి రాజేష్, ఏఎంసీ మాజీ చైర్మన్ అయ్యోరు రాజేష్ కుమార్, బీజేపీ జిల్లా కార్యదర్శి పిల్లి శ్రీనివాస్ పరామర్శించారు అస్వస్థతకు గురైన విద్యార్థులు నాగులపేట, రేచపల్లి, తాళ్లపేట, బురుదేశిపల్లె, గోవింద్‌పల్లెకు చెందిన వారని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కాళ్ల లక్ష్మి తెలిపారు.

మహాకుంభ మేళాకు ఆరు ప్రత్యేక రైళ్లు..



- ఫిబ్రవరి 14, 18, 22 తేదీల్లో నడపనున్న దక్షిణమధ్య రైల్వే

పెద్దపల్లి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ప్రయాగరాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాకు మరో ఆరు ప్రత్యేక రైళ్లను అదనంగా నడపను న్నట్లు అధికారులు శుక్రవారం ప్రకటించారు. రైలు నంబర్ 07111 ఫిబ్రవరి 14న ఉదయం 11:10 గంటలకు బీదర్ నుంచి దానాపూర్‌కు బయలుదేరి మరుసటి రోజు రాత్రి 23.55 గంటలకు చేరుకోనున్నది. ఈ రైలు రాష్ట్రంలో జహీరాబాద్, వికారాబాద్, లింగంపల్లి, బేగంపేట్, సికింద్రాబాదు, చర్లపల్లి, జనగాం, ఖాజీపేట్, జమ్మికుంట, పెద్దపల్లి, రామగుండం, మంచిర్యాల, బెల్లంపల్లి, సిర్పూర్ కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్లలో ఆగనున్నది. ఇదే రైలు నంబర్ 07112 ఫిబ్రవరి 16న ఉదయం దానాపూర్‌నుంచి 15:15 గంటలకు బయలుదేరి, రెండో రోజు 23:45 గంటలకు చర్లపల్లి (హైదరా బాద్) స్టేషన్‌కు చేరుకోనున్నది. రైలు నంబర్ 07077 ఫిబ్రవరి 18, 22 తేదీల్లో మధ్యాహ్నం 15:00 చర్లపల్లి నుంచి బయలుదేరి మరుసటి రోజు రాత్రి దానాపూర్ చేరుకోనున్నది. అలాగే రైలు నంబర్ 07078 ఫిబ్రవరి 20, 24 తేదీల్లో మధ్యాహ్నం 15:00 గంటలకు దానాపూర్‌లో బయలుదేరి మరుసటి రోజు రాత్రి 23:45 గంట లకు చర్లపల్లి చేరుకోనున్నది. ఈ రైళ్లు రాష్ట్రంలోని జనగాం, ఖాజీపేట్, జమ్మికుంట, పెద్దపల్లి, రామగుండం, మంచిర్యాల, బెల్లంపల్లి, కాగజ్‌నగర్ ఆగుతాయి.

జమ్మికుంటలో రూ.7,150 పలికిన పత్తి ధర



జమ్మికుంట రూరల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7150 పలికింది. శుక్రవారం వ్యవసాయ మార్కెట్ యార్డుకు 26మంది రైతులు 310క్వింటాళ్ల విడి పత్తి, ఎనిమిది మంది రైతులు 32క్వింటాళ్ల గోనె సంచుల్లో పత్తి విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర రూ.7150, కనిష్ఠ ధర రూ.6వేలు చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

- పెద్దపల్లి లో రూ.7022

పెద్దపల్లి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం పత్తి ధరలు తగ్గడంతో రైతులు ఆందోళన చేయగా, శుక్రవారం మార్కెట్‌కు వచ్చిన పత్తికి అత్యధికంగా 7,022 రూపాయల ధర పలికింది. అత్యల్పంగా ఐదు వేల రూపాయలు, మోడల్ ధర 6,681 రూపాయలు పలికింది. అత్యధిక మంది రైతులకు 6,500 నుంచి ఏడు వేల రూపాయల మధ్య ధర పెట్టారు. మార్కెట్‌కు 1,199 బస్తాల్లో 1318.9 క్వింటాళ్ల పత్తిని 330 మంది తీసుకువచ్చారు. ఈ-నామ్ ద్వారానే పత్తిని ట్రేడర్లు పరిశీలించి ధరలు ఖరారు చేశారు. గురువారం అత్యధిక మంది రైతులకు క్వింటాలుకు 6,500 రూపాయలకు మించకుండా చెల్లించారు. 52 బస్తాలకే 7,001 నుంచి 7,031 ధర చెల్లించారు. అత్యధికంగా 6,500 నుంచి 7,000 చెల్లించారు.

ఉత్సాహంగా.. పోలీస్ క్రీడలు



కిందపడి గాయపడిన యాదాద్రి క్రీడాకారిణి సంగీత



కబడ్డీ ఫైనల్ మ్యాచ్‌లో తలపడుతున్న రాచకొండ, హైదరాబాద్ సిటీ పోలీస్ జట్లు



- పోటాపోటీగా నాల్గవ రోజు ఆటలు
- నేడు ముగింపు సమావేశం
- హాజరు కానున్న డీజీపీ డాక్టర్ జితేందర్

కరీంనగర్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మూడవ తెలం గాణ రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడలు ముగింపు దశకు చేరా యి. నాలుగు రోజులుగా జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంతో పాటు 12 ప్రదేశాల్లో నిర్వహిం చిన 28 క్రీడలు చివరి దశకు చేరాయి. 20 పోలీస్ జోన్ల నుంచి 2400 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటారు. పోటీల నాల్గవ రోజు శుక్రవారం వివిధ క్రీడాంశాల్లో సెమీఫైనల్స్, ఫైనల్స్ మ్యా చ్‌లను నిర్వహించారు. క్రీడా కారులు పోటాపోటీగా తమ క్రీడా ప్రతిభను చాటి విజేత లుగా నిలిచేందుకు కృషి చేశారు. వివిధ పోటీలను ఐజీపీ స్పోర్ట్స్ ఎస్ రమేష్ రెడ్డితోపాటు మరో ఐజీపీ ఎం చంద్రశేఖర్ ఎడ్డి, కరీంనగర్ సీపీ అభిషేక్ మొహంతి, పోలీస్ స్పోర్ట్స్ ఆఫీసర్ రామారావు, ఏసీపీ విజయ్ కుమార్, ఆర్ఐ కుమారస్వామి తదితరులు పాల్గొని ప్రారంభించారు.

- పోటీల ఫలితాలు..

ఖో-ఖో పోటీల్లో టీజీఎస్‌బి-1 ప్రథమ స్థానం, టీజీఎస్‌బి-2 ద్వితీయ స్థానం, రాజన్న జోన్-3 తృతీయ స్థానం సాధించాయి. కబడ్డీ మహిళల విభాగంలో రాచకొండ కమిషనరేట్ ప్రథమ స్థానం, యాదాద్రి జోన్ ద్వితీయ స్థానం సాధించాయి. పురుషుల విభాగంలో హైదరాబాద్ సిటీ జోన్ ప్రథమ స్థానం, రాచకొండ ద్వితీయ స్థానం సాధించాయి. బాస్కెట్‌బాల్ క్రీడాంశంలో హైదరాబాద్ కమిషనరేట్ ప్రథమ స్థానం, కాళేశ్వరం జోన్ ద్వితీయ స్థానాలు సాధించాయి. హాకీ క్రీడల్లో హైదరాబాద్ సిటీ జోన్ ప్రథమ స్థానం, వరంగల్ జోన్ ద్వితీయ స్థానం సాధించాయి. హ్యాండ్‌బాల్ క్రీడలో టీజీఎస్‌బి-1 ప్రథమ స్థానం, హైదరాబాద్ సిటీ ద్వితీయ స్థానం, భద్రాద్రి జోన్ తృతీయ స్థానం సాధించాయి. అలాగే ఫుట్‌బాల్ క్రీడలో టీజీఎస్‌బి-1 ప్రథమ స్థానం, హైదరాబాద్ సిటీ ద్వితీయ స్థానం, సైబరాబాద్ జోన్ తృతీయ స్థానం సాధించాయి. ఈ జట్లకు కరీంనగర్ పోలీస్ పరేడ్ మైదానంలో శుక్రవారం రాత్రి పతకాలను ప్రదానం చేశారు.

- నేడు పోటీల ముగింపు

రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడల ముగింపు ఉత్సవాన్ని శనివారం నిర్వహించనున్నారు. పోలీస్ పరేడ్ మైదానంలో నిర్వహించే ఈ ముగింపు సమావేశానికి తెలంగాణ రాష్ట్ర డీజీపీ డాక్టర్ జితేందర్ హాజరుకానున్నారు. ఉదయం 10 గంటలకు ఈ ఉత్సవాన్ని నిర్వహించనున్నారు. వివిధ క్రీడాంశాల్లో గెలుపొందిన జట్లకు ట్రోఫీలతోపాటు ఓవరాల్ చాంపియన్‌షిప్ ట్రోఫీలను కూడా అందించనున్నారు.

ప్రతి సంవత్సరం పోలీస్ క్రీడల నిర్వహణకు కృషి

- ఐజీ స్పోర్ట్స్ రమేష్‌రెడ్డి

కరీంనగర్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): గత కొన్ని సంవత్సరాలుగా నిర్వహణకు నోచుకోని తెలంగాణ రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడలను ఇక నుంచి ప్రతి సంవత్సరం నిర్వహించేందుకు కృషి చేస్తానని ఐసీ స్పోర్ట్స్ తెలంగాణ రమేష్‌రెడ్డి అన్నారు. కరీంనగర్‌లో గత నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న మూడవ తెలంగాణ రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడలలో శుక్రవారం ఆయన ఖో-ఖో, హాకీ, వాలీబాల్ క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడలను ఘనంగా నిర్వహిస్తున్న కరీంనగర్ పోలీస్ కమిషనర్‌ను ఆయన అభినందిం చారు. అనంతరం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో హాకీ ఆడి క్రీడాకారులను ప్రోత్సహించారు. అలాగే సీటీసీ మైదానంలో నిర్వహిస్తున్న ఖో-ఖో పోటీలను తిలకించారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న స్పోర్ట్స్ ఐజీ రమేష్‌రెడ్డి

ఖో-ఖో క్రీడల్లో మంచి ప్రతిభచాటుతున్న సిరిసిల్ల జోన్ అంతర్జాతీయ క్రీడాకారుడు వెంకటేష్‌ను ఐజీ అభినం దించారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ ఆఫీసర్ డీఎస్పీ రామారవు, ఏసీపీ విజయ్ కుమార్, సీఐ మధు, ఎస్ఐ నరేష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



పతకాలు అందుకున్న క్రీడాకారులు



వాలీబాల్ ఫైనల్ మ్యాచ్‌లో తలపడుతున్న సైబరాబాద్, హైదరాబాద్ క్రీడాకారులు

మట్టి నుంచి మ్యాట్‌పైకి..

- కబడ్డీకి పెరిగిన ఆదరణ
- ప్రో కబడ్డీతో కార్పొరేట్ స్థాయికి
- అంతర్జాతీయ కబడ్డీ క్రీడాకారులు డీఎస్పీ ఏ వేణుగోపాల్, ఇన్‌స్పెక్టర్ ఎం మహేందర్‌రెడ్డి

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ క్రీడగా ఉన్న కబడ్డీ ఇప్పుడు కార్పొరేట్‌కు మారింది. పల్లెల్లో మట్టిరోడ్లపై ఆడిన ఆట మ్యాట్‌పైకి చేరింది. కబడ్డీ ఇప్పుడు కార్పొరేట్ క్రీడ.. ప్రో కబడ్డీ నిర్వహణతో రెండు తెలుగు రాష్ట్రాల అధికారిక క్రీడ ఇప్పుడు అంతర్జాతీయంగా గర్తింపు పొందింది. కరీంనగర్‌లో రాష్ట్ర స్థాయి పోలీస్ క్రీడలు నిర్వహిస్తున్న సందర్భంగా అంతర్జాతీయ కబడ్డీ క్రీడాకారులు డీఎస్పీ ఏ వేణుగోపాల్, ఇన్స్‌పెక్టర్ ఎం మహేందర్‌రెడ్డి 'ఆంధ్రజ్యోతి'తో పలు అంశాలు పంచుకున్నారు.

ప్రో కబడ్డీని టీవీల్లో 20 కోట్ల 20 లక్షల మంది ప్రేక్షకులు వీక్షించారు. ఇది ప్రపంచ చరిత్రలో అత్యధికం. ఏ క్రీడలో లేని విధంగా అత్యధికశాతం ఉద్యోగాలు కబడ్డీతో వస్తున్నాయని వారు తెలిపారు. గతంలో తెలుగు రాష్ట్రాల్లో కబడ్డీ అకాడమీలు ఉండేవి. అప్పుడు గ్రామీణ స్థాయి నుంచి ప్రతిభగల క్రీడాకారులు అకాడమీలో చేరి ఉన్నతమైన క్రీడాకారుడులుగా ఎదిగారన్నారు. ప్రభుత్వం చొరవ తీసుకొని జిల్లాకు ఒక కబడ్డీ క్రీడా అకాడమీ నెలకొల్పాలన్నారు. కబడ్డీ ఇప్పుడు ఇండోర్ క్రీడగా మారిందన్నారు. క్రీడా శిక్షణతో విద్యార్థులలో ఆరోగ్యం, చక్కని శారీరక అభివృద్ధి కలుగుతాయని అన్నారు. ఉత్తమ పౌరులుగా ఎదిగే అవకాశం ఉందని తెలపిపారు. తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో కబడ్డీ క్రీడాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత 2017లో రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడలను నిర్వహించారన్నారు. ఇప్పుడు ఐసీ స్పోర్ట్స్ రమేష్‌రెడ్డి కృషితో కరీంనగర్‌లో మూడవ రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడలను నిర్వహించడం అభినందనీయ మన్నారు. ప్రతి సంవత్సరం పోలీస్ క్రీడలను నిర్వహిస్తే, ప్రతిభగల క్రీడాకారులు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంటుందన్నారు.



ఏ వేణుగోపాల్, ఎం మహేందర్ రెడ్డి

> పోలీసుశాఖలో ఉన్నతస్థాయిలో ఉన్న డీఎస్పీ ఏ వేణుగోపాల్ 2000 సంవత్సరంలో కొలంబోలో జరిగిన ఏషియన్ కబడ్డీ పోటీల్లో భారతజట్టు నుంచి పాల్గొని బంగారు పతకం సాధించారు. ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్, కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎం మహేందర్‌రెడ్డి 2016 సంవత్సరంలో అస్సాంలో జరిగిన సౌత్ ఏషియన్ గేమ్స్‌లో భారతజట్టుకు ప్రాతినిధ్యం వహించి బంగారు పతకం సాధించారు.

డిగ్రీ మొదటి సెమిస్టర్ ఫలితాలు విడుదల

గణేశ్‌నగర్,జనవరి 31(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (స్వ యం ప్రతిపత్తి) బీఏ, బీకాం, బీఎస్సీ ప్రథమ సంవత్సరం మొదటి సెమిస్టర్ ఫలితాలను కళాశాల ప్రిన్సిపాల్, ప్రొఫె సర్ డి.వరలక్ష్మి శుక్రవారం విడుదల చేశారు. బీఏలో 47.74 శాతం, బీకాంతో 70.25, బీఎస్సీ లైఫ్ సెన్సెస్‌లో 48.46, బీ ఎస్సీ ఫిజికల్ సైన్స్‌లో 60.94 శాతం మంది ఉత్తీర్ణులైనట్లు ఆమె తెలిపారు. https://gdcwakarimnagar.com ఫలితాలు కళాశాల వెబ్సై ట్‌లో అందు బాటులో ఉన్నట్లు పేర్కొన్నారు.

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ

వేములవాడ కల్చరల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో శుక్రవారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చి న భక్తులు ఉదయం నుంచి రాజన్న దర్శనం కోసం క్యూలైన్‌లో బారులు తీరారు. రాజన్నకు అత్యంత ప్రీతిపాత్రమైన కోడె మొక్కు చెల్లిం చుకున్న భక్తులు శ్రీపార్వతి పర మేశ్వరులను దర్శించుకున్నారు. అనంతరం అన బంధ ఆలయాల్లో కుంకుమ పూజలు ర్వహించారు.

- రాజన్న ఆలయంలో విభాగాల హక్కులకు టెండర్ నిర్వహణ

రాజన్న ఆలయంలోని పలు విభాగాల్లోని హక్కులకు ఓపెన్‌స్లాబ్‌లో టెండర్ నిర్వహిం చారు. ఆలయ ఈవో వినోద్‌రెడ్డి ఆదేశాల మేరకు అధికా రులు రెండు సంవత్సరాలకు టెండ ర్‌ను నిర్వహించగా, కొబ్బరికాయల విక్రయం లైసెన్స్ హక్కులను రూ.2 కోట్ల 20 లక్షల 55 వేల 555కు శివరాత్రి చందు దక్కించుకోగా, వెజిటేరియన్ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌ను వేములవాడకు చెందిన రమేష్ రూ.46 లక్షల 50 వేలకు, కరీంనగర్‌లోని ఆలయానికి చెందిన 26వ నంబర్ షాప్ రూ.3 లక్షల 60 వేలకు, రాజన్న ఆలయంలోని శ్రీస్వామి వారికి భక్తులు సమ ర్పించుకునే ఒడిబియ్యం టెండర్‌ను జోగాపూర్ గ్రామానికి చెందిన విక్రమ్ రూ.కోటి 95లక్షల 55వేల 999కి దక్కించుకున్నట్లు ఆలయాధి కారులు వెల్లడించారు.



ఆలయంలో క్యూలో ఉన్న భక్తులు

ఎగువ మానేరులోకి మల్లన్నసాగర్ నీటి విడుదల

గంబీరావుపేట. జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : రాజన్న సిరిసిల్ల జిల్లా గంబీరావుపేట మండలం నర్మాల ఎగువ మానేరు ప్రాజెక్టులోకి మల్లన్న సాగర్ నీటిని విడుదల చేశారు. రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు సంబంధిత అధికారులు నీటి విడు దల చేశారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి ఈ ప్రాంత రైతుల ప్రయోజ నార్థం 0.5 టీఎంసీల నీటి విడుదలకు సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి విన్నవించారని హమీద్ తెలిపారు. రైతుల పంటలు ఎండిపోకుండా మల్లన్నసాగర్ నుంచి మానేరులోకి నీటిని విడుదల చేయాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. నీటి విడుదలకు సహక రించిన మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు, సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డికి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు హమీద్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. శనివారం వరకు మల్ల న్నసాగర్ నీరు ఎగువ మానేరులోకి చేరుతుండటంతో ఈ ప్రాంత రైతుల్లో ఆనందం నెలకొంది.

విజేత సూపర్‌మార్కెట్ ప్రారంభం

సుభాష్‌నగర్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా కేంద్రంలోని రేగులపాటి పాపా రావు కాంప్లెక్స్ (పాత స్పెన్సర్స్ మాల్)లో నూతనంగా ఏర్పాటు చేసిన విజేత సూపర్ మార్కెట్‌ను శుక్రవారం ఎమ్మెల్యే గంగుల కమలాకర్, సుడా చైర్మెన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్నిరకాల సరుకులు ఒకేచోట దొర కడం ప్రజలకు ఎంతో సౌకర్యవం తంగా ఉంటుందన్నారు. సూపర్ మార్కెట్ నిర్వాహకులు మాట్లా డుతూ సరసమైన ధరలకు అన్ని రకాల వస్తువులు అందజేస్తున్నా మని తెలిపారు. అన్నిరకాల సరు కు లు అందుబాటులో ఉంచా మని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గంగుల కమలాకర్, సుడా చైర్మెన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డిలను సన్మానించారు. మాజీ ఎమ్మె ల్యే రేగులపాటి పాపారావు, మాజీ కార్పొరేటర్ బండ సుమ రమణారెడ్డి సూపర్‌మార్కెట్ సిబ్బంది పాల్గొన్నారు.



కరీంనగర్‌లో విజేత సూపర్‌మార్కెట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్, సుడా చైర్మెన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి

వైకల్యాన్ని జయించి..

- కార్, బైక్ సర్వీసింగ్ సెంటర్లు ఏర్పాటు..
- స్వయంఉపాధితో దివ్యాంగుల ముందడుగు..

రుద్రంగి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలానికి చెందిన ఇద్దరు యువకులు పుట్టకతో వచ్చిన లోపాలను లెక్క చేయకుండా.. పట్టుదలతో వృత్తిలో రాణిన్నారు. మూగ, చెవిటివారైన ఆ ఇద్దరూ స్వయం ఉపాధితో ముందుకు సాగుతున్నారు. మెరుగైన పనితనంతో తమ వద్దకు వచ్చిన కస్టమర్లను ఆకట్టుకుం టున్నారు.

మండల కేంద్రానికి చెందిన మెల్ల దేవలక్ష్మి-నర్సరెడ్డి దంపతుల రెండో కూమారుడు మెల్ల ప్రవీణ్ పుట్టుకతో చెవిటి, మూగ. గ్రామంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో పదో తరగతి చదువుకున్నాడు. కుటుంబ ఆర్థిక పరిస్థితి దృష్టిలో పెట్టుకొని చదువు మానేసి. రుద్రంగిలో బైక్ మెకానిక్ షాపులో రెండు సంవత్సరాల పాటు రిపేరింగ్ నేర్చుకున్నాడు. అనంతరం తెలిసిన వారి వద్ద కొంత రుణం తీసుకొని కారు, బైక్ వాటర్ సర్వీసింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేశాడు. తన ఆర్థిక ఎదుగుదలకు వైకల్యం అడ్డుకాకూడదని భావించిన ప్రవీణ్ మెరుగైన పనితీరుతో వాహనదారులకు ఆకట్టుకుంటున్నాడు. ప్రస్తుతం ఖర్చులు పోను నెలకు రూ.15 వేల వరకు మిగులుతున్నాయని ప్రవీణ్ పేర్కొంటున్నాడు. అలాగే మండల కేంద్రానికి చెందిన చిట్టపురం గణేష్ అనే యువకుడు సైతం పుట్టుకతో మూగ, చెవిటి. వాహనాల వాటర్ సర్వీసింగ్ సెంటర్‌లో కొంతకాలం పనిచేశాడు. ఏడాది క్రితం కొంత అప్పు చేసి ఇంటి వద్దనే రేకుల షెడ్డు ఏర్పాటు చేసుకొని కారు, బైక్ వాటర్ సర్వీసింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేసుకున్నాడు. తనలోని లోపాన్ని చూసి కృంగి పోకుండా స్వంతంగా ఉపాధి పొందుతున్న గణేష్‌ను పలువురు అభినందిస్తున్నారు.



కార్ వాటర్ సర్వీసింగ్ చేస్తున్న ప్రవీణ్



బైక్ వాటర్ సర్వీసింగ్ చేస్తున్న గణేష్

లక్ష్యసాధనకు నిరంతరం కృషి చేయాలి

కరీంనగర్ టౌన్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): లక్ష్యసాధనకు విద్యార్థులు నిరంతరం కృషిచేయాలని , పట్టుదలతో విద్యనభ్యసించి ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. జిల్లా కేంద్రంలోని సప్తగిరికాలనీ జడ్పీ ఉన్నత పాఠశాలలో బ్రైట్ చైల్డ్ ఫౌండేషన్ నిర్వాహకులు ఏర్పాటు చేసిన ల్యాబ్‌ను శుక్రవారం ప్రారంభించారు.ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, సమగ్ర శిక్ష కో ఆర్డినేటర్ అశోక్, హెచ్ఎం రాజేందర్, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఆలోచింపజేసిన 'ఎనిమిదో అడుగు' నాటకం



నాటకంలోని సన్నివేశం

కరీంనగర్ కల్చరల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : మన సమైక్యత కల్చరల్ అకాడమీ ఆధ్వర్యంలో అధ్యక్షుడు, సినీ నటుడు రొడ్డ యాదగిరి నేతృత్వంలో శుక్రవారం కళాభారతిలో ప్రదర్శించిన 'ఎనిమిదో అడుగు' నాటకం ప్రేక్షకులను ఆలోచింపజేసింది. నాటకాన్ని సంస్థ గౌరవాధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ ప్రారంభించారు. నాటికద్వారా వివాహంలో ఏడు అడుగుల బంధం గొప్పదని, ఎనిమిదో అడుగు వేయరాదని అది తప్పటడుగు అవు తుందని చేప్పే సందేశం ఇచ్చారు. సినీ రచయిత దివాకర్‌బాబు నాటికను రచించగా, డాక్టర్ శ్రీజ సాధినేని దర్శకత్వం వహించారు. శ్రీజ, శశిధర్, శ్రీనాథ్ యాదవ్ నటించారు. కళాకారులు గుండ్ర కృపాదానం, కూనమల్ల రమేశ్, మున్నూరి రాజేశ్వరరావు, కాసు మహేందర్‌రాజు పాల్గొన్నారు.

సోలార్‌ప్లాంట్‌ల ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం

గణేశ్‌నగర్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): సోలార్‌ప్లాంట్‌ల ఏర్పాటుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కరీంనగర్ సర్కిల్ సూపరింటెండెంగ్ ఇంజనీర్ రమేష్‌బాబు శుక్రవారం ప్రకటనలో సూచించారు. రైతులు, వ్యవసాయ ఉత్పత్తి సంఘాలు, రైతు సమూహాలు, నీటి వినియోగదారుల సంఘాలు, సహకార సంఘాలు, స్వయం సహాయక బృందాలు, పంచాయతీలు, గ్రామ సంస్థలు, మండల సమాఖ్యలు, డెవలపర్స్(రైతుల భూమి లీజు ఒప్పందం ద్వారా) దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ నెల 22లోగా www.tgredco.telangana.gov.in వెబ్ సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలని, వివరాలకు టీజీ రెడ్కో డీజీఎం 630490 3933, జీఎం 9000550974 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

దివ్యాంగుల ఉపాధి పునరావాస పథకం గడువు పొడిగింపు

కరీంనగర్ టౌన్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ఈ నెల 2తో ముగియనున్న దివ్యాంగుల ఉపాధి పునరావాస పథకం గడువును ప్రభుత్వం 12 వరకు పొడిగించినట్లు జిల్లా సంక్షేమ అధికారి సబితకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. దివ్యాంగుల ఆర్థిక స్వావలంబనకు రాష్ట్ర ప్రభుత్వం పథకం ప్రవేశపెట్టిందని, అర్హులైన వారు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

శిశు గృహం శిశువు దత్తత

కరీంనగర్ టౌన్/కరీంనగర్ క్రైం జనవరి 31(ఆంధ్రజ్యోతి): మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ పరిధిలోని కరీంనగర్ శిశు గృహం నుంచి నాలుగు నెలల శిశువును కలెక్టర్ పమేలా సత్పతి చేతుల మీదుగా పూణెకు చెందిన దంపతులకు దత్తత ఇచ్చారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కార్యక్రమం నిర్వహించారు. జిల్లా సంక్షేమ అధికారి సబిత, డీసీపీవో పర్వీన్, పీవో తిరుపతి, శిశు గృహ మేనేజర్ తేజస్వీ పాల్గొన్నారు.

అంకిత భావంతో పని చేస్తే గుర్తింపు

సుభాష్‌నగర్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): అంకిత భావంతో పని చేస్తే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని సమాచార, పౌరసంబంధాలశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ లక్ష్మణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏపీఆర్‌వో వీరాంజనేయులు ఉద్యోగ విరమణ సందర్భంగా ఆత్మీయ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శి సంగెం లక్ష్మణరావు, టౌన్ అధ్యక్షుడు మారుపాక రాజేశ్‌భరద్వాజ్ సన్మానించారు. టీఎన్‌జీవో నాయకులు రాగి శ్రీనివాస్, సర్దార్ హర్మిందర్‌సింగ్, హాస్గర్, సిద్దిపేట జిల్లా డీపీఆర్వో రవికుమార్, పెద్దపల్లి జిల్లా ఇన్‌చార్జి డీపీఆర్వో జగన్ పాల్గొన్నారు.

భగత్‌నగర్: కరీంనగర్ బస్‌స్టేషన్ మేనేజర్ ఎస్.అంజయ్య పదవీ విరమణ సందర్భంగా దంపతులను కరీంనగర్-1 డిపోలో డిపో మేనేజర్ విజయమాధురి, కరీంనగర్ డిప్యూటీ రీజినల్ మేనేజర్ (ఆపరేషన్స్) భూపతిరెడ్డి సన్మానించారు.

కరీంనగర్ క్రైం/గణేశ్‌నగర్: కరీంనగర్ ఒకటో ఠాణాలో ఏఎస్సైగా పనిచేస్తున్న చాంద్‌పాషా పదవీ విరమణ పొందగా కమిషనరేట్‌లో అడిషనల్ డీసీపీ లక్ష్మీనారాయణ జ్ఞాపికను అందజేశారు. తెలంగాణ పవర్ ఇంజినీర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కరీంనగర్ బ్రాంచ్ కరీంనగర్ క్లబ్‌లో పదవీ విరమణ పొందుతన్న ఇంజినీర్ కామ అంజయ్యను సన్మానించారు.

రహదారుల నిర్మాణానికి రూ.13.18 కోట్లు

తిమ్మాపూర్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): మానకొండూరు నియోజకవర్గంలోని పలుగ్రామీణరహదారుల నిర్మాణానికి రాష్ట్రప్రభుత్వం పంచాయతీ రాజ్‌శాఖ ద్వారా 13కోట్ల18లక్షల45వేల రూపాయల నిధులను మంజూరు చేసింది. ఈమేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసిందని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ తెలిపారు. ఈనిధులతో నియోజకవర్గంలోని 33.09 కిలోమీటర్ల వరకు 9ప్రాంతాల్లో రోడ్డు పనులు చేపట్టనున్నట్లు తెలిపారు.

ఘనంగా ఫ్రెషర్స్‌డే

తిమ్మాపూర్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): శ్రీచైతన్య ఫార్మసీ కళాశాలలో శుక్రవారం ఫ్రెషర్స్‌డే కార్యక్రమాన్ని విద్యా సంస్థల చైర్మన్ ముద్దసాని రమేష్‌రెడ్డి ప్రారంభించారు. విద్యార్థులందరూ జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. అనంతరం చదువులో ఉత్తమప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ రామనర్సింహారెడ్డి, ఎచ్‌వోడీలు అప్పారావు, రవిందర్‌రెడ్డి, రాంప్రసాద్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వాగేశ్వరిలో టెడ్ టాక్స్ ప్రెజంటేషన్

తిమ్మాపూర్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): వాగేశ్వరి ఇంజనీరింగ్ కళాశాల ఆడిటోరియంలో శుక్రవారం కరీంనగర్ పారమిత విద్యాసంస్థల విద్యార్థులు టెడ్‌టాక్స్ ప్రజెంటేషన్స్ నిర్వహించారు. వాగేశ్వరి కళాశాలల జనరల్ సెక్రెటరీ శ్రీనివాస్‌రెడ్డి, విద్యాసంస్థల చైర్మన్ ప్రసాద్‌రావు పాల్గొన్నారు.

ఆటోమేటెడ్ వెల్డింగ్‌తో విప్లవాత్మక మార్పులు

హుజూరాబాద్‌రూరల్,జనవరి 31(ఆంధ్రజ్యోతి): ఆటోమొబైల్ రంగంలో ఆటోమేటెడ్ వెల్డింగ్, రోబోటిక్ వెల్డింగ్‌లను ఉపయోగిస్తున్నారని భోపాల్ ఎన్ఐటీ టెక్నికల్ టీచర్స్ ట్రైనింగ్అండ్‌రీసెర్చ్ ప్రొఫెసర్ డాక్టర్ సువర్ణరాజు అన్నారు. మండలంలోని సింగాపూర్‌లోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో అధ్యాపకులకు జరుగుతున్న శిక్షణ కార్యక్రమానికి హజరై మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ కె శంకర్, డాక్టర్ మల్లయ్య, డాక్టర్ రాజేంద్రప్రసాద్, డాక్టర్ ఎంవి సతీష్ కుమార్, అధ్యాపకులున్నారు.

జర్నలిస్టుల పోరాటానికి రజకుల మద్దతు

హుజూరాబాద్/వీణవంక, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): వారం రోజులుగా జర్నలిస్టులు 'మా ఇల్లు మాకు కావాలి' అంటూ చేస్తున్న పోరాటానికి రజకుల మద్దతు ఉంటుందని రజక హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు పూసాల సంపత్ అన్నారు. శుక్రవారం హుజూరాబాద్, వీణవంకలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలన్నారు.

మూగజీవాలపై కరుణ చూపాలి

హుజూరాబాద్‌రూరల్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): మూగ జీవాలపై విద్యార్థులు కరుణ చూపాలని పశువైద్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ రవి కుమార్ అన్నారు. మండలంలోని సింగాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో జంతుసంరక్షణ పక్షోత్సవాల సందరభంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ వినోద్, సింగాపూర్ పశువైద్యాధికారి డాక్టర్ రవీందర్‌రెడ్డి ఉన్నారు.

ఇరుకుల్లను ఎలబోతారం ఎంపీటీసీ పరిధిలో చేర్చాలి

కరీంనగర్ రూరల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇరుకుల్ల గ్రామాన్ని చేగుర్తిలో కాకుండాఎలబోతారం ఎంపీటీసీ పరిధిలోగానీ చెర్లబూత్కూర్ ఎంపీటీసీ పరిధిలోగానీ చేర్చాలని శుక్రవారం గ్రామ మాజీ సర్పంచ్ జువ్వాడి మారుతి రావు కోరారు. శుక్రవారం జడ్పీ సీఈవో శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేశారు. చేగుర్తిలో తమ గ్రామాన్ని చేరిస్తే నాలుగు కిలోమీటర్ల దూరం ఉటుందని మిగతా గ్రామాల పరిధిలో చేర్చితే చేరువలో ఉంటుందని తెలిపారు.

పారిశుధ్యం మెరుగుపడాలి



సమావేశంలో మున్సిపల్ కమిషనర్ చాహాత్ బాజ్‌పాయ్

కరీంనగర్ టౌన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): నగరంలో పారిశుధ్యం మరింత మెరుగుపడాలని మున్సిపల్ కమిషనర్ చాహాత్‌బాజ్‌పాయ్ అన్నారు. నగరపాలక సంస్థలో పారిశుధ్య విభాగం అధికారులతో శుక్రవారం నిర్వహించిన సమీక్షలో మాట్లాడారు. ప్రతీ ఇంటి నుంచి తడి, పొడిచెత్తను వేరుచేసి సేకరించాలని, వేరుచేసే బాధ్యత సానిటరీ ఇన్‌స్పెక్టర్లదేనని అన్నారు. చెత్త కలెక్షన్ పాయింట్లు, డంపర్‌బిన్స్, అండర్ గ్రౌండ్ బిన్స్ ప్రదేశాలను పరిశుభ్రంగా ఉండేలా చూడాలని, చెత్త ఎక్కువగా వచ్చే ప్రదేశాల్లో అండర్ గ్రౌండ్ బిన్స్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. అండర్ గ్రౌండ్ బిన్స్‌లోనే ప్రజలు చెత్తవేసేలా సానిటరీ ఇన్‌స్పెక్టర్లు, జవాన్లు చర్యలు తీసుకోవాలన్నారు. స్వచ్ఛ ఆటోలు ప్రతీ రోజు 500 నివాస గృహాలు తిరిగేలా చర్యలు తీసుకునేలా ప్రత్యేక రూట్ మ్యాప్ రూపొందించాలన్నారు. విలీన మున్సిపాలిటీ, గ్రామాల్లో కూడా పారిశుధ్య పనులు ఆగకుండా చూడాలని, అక్కడ పారిశుధ్యం కోసం వినియోగిస్తున్న వాహనాలను తనిఖీచేసి స్వాధీనంచేసుకోవాలని అన్నారు. డివిజన్ల వారిగా ట్రేడ్ లైసెన్సు కట్టించాలని, ప్రతి దుకాణానికి లైసెన్సు తప్పనిసరిగా ఉండాలని అన్నారు. గతంలో లైసెన్సులు తీసుకున్న వారి దుకాణాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి కొలతలను తనిఖీ చేయాలని, ఏమైనా తేడాలుంటే 25శాతం జరిమానా విధించాలని ఆదేశించారు. నిర్లక్ష్యంగా వహిస్తే చర్యలు తప్పవని కమిషనర్ హెచ్చరించారు. అసిస్టె ంట్ కమిషనర్ వేణుమాధవ్, సానిటరీ ఇన్ స్పెక్టర్లు శ్రీనివాస్, శ్రీధర్, వెంకన్న, మహేందర్, నరోత్తమ్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌పై ఆశలు

(5వ పేజీ తరువాయి)

జమ్మికుంటలో తెలంగాణ, జీటీ ఎక్స్‌ప్రెస్‌లకు హాల్టింగ్ కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

● ఆదాయ పన్ను మినహాయింపు పరిధిని పెంచాలి

కేంద్ర ప్రభుత్వం ఆదాయ పన్ను మినహాయింపు పరిధిని 7 లక్షల నుంచి 10 లక్షలకు పెంచి వేతన జీవులు, మధ్యతరగతి ప్రజలకు ఊరట కల్పించాలని కోరుతున్నారు. ఈ ప్రాంతాల్లో పరిశ్రమల ఉత్పత్తులపై పన్నులు తగ్గించాలని, ఎలక్ట్రానిక్ పరికరాలు, ఇతర అత్యవసరాలపై ఇంపోర్టు డ్యూటీని తగ్గించాలని ప్రజలు కోరుకుంటున్నారు.

మూడు నెలలుగా వేతనాలు లేవు

కరీంనగర్ రూరల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మూడు నెలలుగా వేత నాలు రాక ఇబ్బందులు పడుతున్నామని, తమ సమస్యలను పరిష్కరించాలని ఉపాధిహామీ సిబ్బంది కోరారు. శుక్రవారం అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, డీఆర్డీవో శ్రీధర్‌కు వినతి పత్రం అందజేశారు. ప్రభు త్వం ఉపాధిహామీ సిబ్బంది కష్టాన్ని గుర్తించడం లేదన్నారు. జీతాలు ఇవ్వకపోవడంతో కుటుంబ పోషణ భారమవుతోందని, స్కూల్ ఫీజులు చెల్లించలేక పోతున్నామని అన్నారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసు కెళ్లాలని, వేతనాలు ఇప్పించాలని కోరారు. ఏపీవో శోభరాణి పాల్గొన్నారు.

యోగా అభివృద్ధికి సమగ్ర కృషి



సమావేశంలో మాట్లాడుతున్న రవీందర్ సింగ్

కరీంనగర్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా యోగాభివృద్ధికి కృషి చేయనున్నట్లు తెలంగాణ యోగా అసోసియేషన్ చైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్ తెలిపారు. కరీంనగర్‌లోని తార హోటల్‌లో శుక్రవారం నిర్వహించిన అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ క్రీడాకారులు జాతీయస్థాయిలో రాణించడం సంతోషదాయకమన్నారు.మొదటి సారి జాతీయస్థాయి జూనియర్స్ విభాగంలో బంగారు పతకం సాధించిన పురాణం దీపక్‌ను అభినందించారు. కార్యక్రమంలో తెలంగాణ యోగా అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్ఎన్ రెడ్డి, యోగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షుడు జాల మనోహర్, కరీంనగర్ జిల్లా యోగా అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కన్న కృష్ణ, అసోసియేషన్ కార్యదర్శి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ మేయర్ సునీల్‌రావు వ్యాఖ్యలు హాస్యాస్పదం

కరీంనగర్ టౌన్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): రాజకీయ లబ్ధికోసం సోదరుడి భార్య (వదిన)ను ఓడించిన మాజీ మేయర్ యాదగిరి సునీల్‌రావు నీతి గురించి మాట్లాడుతున్నారని, ఆయన వ్యాఖ్యలు హాస్యాస్పదమని ఎంఐఎం నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్, మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ సమీ అన్నారు. శుక్రవారం స్థానిక ఎంఐఎం కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆయన రాజకీయ జీవితమే ముస్లింలు పెట్టిన భిక్షని అన్నారు. మేయర్‌కాక ముందు, ఇప్పుడు సునీల్‌రావు ఆస్తులేమిటో బహిర్గతం చేస్తామన్నారు. నాయకులు బర్కత్ అలీ, ఖమెుద్దీన్, ఇబ్ర హీం, అతిన, అఖిల్ ఫిరోజ్, షర్ఫుద్దీన్, అలీబాబా తదితరులు ఉన్నారు.

ఎస్‌యూలో కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం

గణేశ్‌నగర్: శాతవాహన విశ్వవిద్యాలయ సైన్స్ కళాశాలలోని కంప్యూటర్ సైన్స్ విభాగంలో కంప్యూటర్ ల్యాబ్‌ను శుక్రవారం శాతవాహన విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఉమేష్ కుమార్ ప్రారంభించారు. సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ జయంతి ఉన్నారు.

బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రం అందజేత

కరీంనగర్ కల్చరల్ : ఈ నెల 3 నుంచి నిర్వహించనున్న కరీంనగర్ మార్కెట్‌రోడ్ వేంకటేశ్వరాలయ బ్రహ్మోత్సవాలకు హాజరు కావాలని పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి, అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి.నరేందర్ రెడ్డికి శుక్రవారం ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు చకిలం శ్రీనివాస్, చకిలం గంగాధర్ ఆహ్వాన పత్రం అందజేశారు.

గద్దర్‌కు ఘన నివాళి

గణేశ్‌నగర్: జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌక్‌లో శుక్రవారం ప్రజా యుద్ధ నౌక గద్దర్ జయంతి నిర్వహించారు. కుల సంఘాల ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పులమాలు వేసి నివాళి అర్పించారు. న్యాయవాది కొరివి వేణుగోపాల్, పుసాల సంపత్, ఆనంద్, గజ్జెల ఆనందరావు, శ్రీధర్, నాయకులు పాల్గొన్నారు.

కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలి

సుభాష్‌నగర్: మాంగ్ కులస్తులకు తహసీల్దార్ ద్వారా కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలని మాంగ్ సమాజ్ జిల్లా అధ్య క్షుడు గాడేకర్ రామేశ్వర్ మాంగ్, ప్రధానకార్యదర్శి కోటంబే సందీప్‌మాంగ్, ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు గాడేకర్ పరశురామ్ డీఆర్‌వో వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందచేశారు.

● సంక్షిప్త సమాచారం

ఏఐఎస్‌ఎఫ్ డైరీ ఆవిష్కరణ

భగత్‌నగర్: ఏఐఎస్‌ఎఫ్ డైరీని జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్య దర్శులు రామారపు వెంకటేశ్, మచ్చరమేష్ ఆవిష్కరించారు.

ఆర్థిక సహాయం

కరీంనగర్ క్రైం: ఇటీవల మరణించిన హెడ్‌కానిస్టేబుల్ రాజిరెడ్డి కుటుంబానికి 1995 కానిస్టేబుల్ బ్యాచ్‌కు చెందిన తోటి పోలీసు మిత్రులు జమచేసిన లక్షా 90 వేల రూపాయల శుక్రవారం అందజేశారు.

ఆరోగ్య సమస్యలపై అవగాహన

సుభాష్‌నగర్ : స్థానిక కరీంనగర్ లోని సరస్వతి శిశు మందిర్ హై స్కూల్‌లో ఆరోగ్య సమస్యలపై విద్యార్థులకు గైనకాలజిస్ట్ డాక్టర్ రేఖ రాణి అవగాహన కల్పించారు. పాఠశాల అధ్యక్షుడు బల్మూరి కరుణాకర్ రావు, కార్యదర్శి ఇంజనీర్ కోల అన్నారెడ్డి ఉన్నారు.

పోలింగ్ కేంద్రాలను పెంచాలి

సుభాష్‌నగర్: కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు పోలింగ్ కేంద్రాలను పెంచాలని బీఆర్‌ఎస్ ప్రతినిధి సత్తినేని శ్రీనివాస్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

ఆలయ వార్షికోత్సవం

కరీంనగర్ కల్చరల్: నగరంలోని బొమ్మకల్ రోడ్ పంచ ముఖ హనుమాన్ దేవాలయం, పరంధా మాశ్రమంలో శుక్రవారం ఆలయ వార్షికోత్సవం నిర్వహించారు. శనివారం ఉదయం 10 గం టలకు మహా కుంభాభిషేకం నిర్వహించనున్నారు.

వాసవి మాత ఆలయంలో ప్రత్యేక పూజలు

కరీంనగర్ కల్చరల్ : నగరంలోని అశోక్ నగర్ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారి ఆత్మార్పణ రోజు సందర్భంగా శుక్రవారం పారువెళ్ల ఫణిశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అధ్యక్ష కార్యదర్శులు చిట్టుమల్ల శ్రీనివాస్, కాచం రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

కరీంనగర్ రూరల్: కరీంనగర్ మండలం దుర్శేడ్‌లో బంగారు పోచమ దేవాలయ ప్రాంగణంలో బంగారు పోచమ్మ, భూలక్ష్మీ, శ్రీలక్ష్మీ సహిత శిల విగ్రహ ప్రతిష్ఠపనోత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ నెల 5వ తేదీ నుంచి 10 వరకు ఉత్స వాలు కొనసాగనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

అంతర్జాతీయ జీబ్రా దినోత్సవం

కరీంనగర్ రూరల్: కరీంనగర్ మండలం నగునూర్ తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలలో శుక్రవారం ప్రిన్సిపాల్ మాలతి ఆధ్వర్యంలో అంతర్జాతీయ జీబ్రా దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులకు క్విజ్ పోటీలు ఏర్పాటు చేశారు.

బీఎస్‌ఎన్‌ఎల్ పెన్షనర్ల ఆత్మీయ సమ్మేళనం

భగత్‌నగర్: బీఎస్‌ఎన్‌ఎల్ పెన్షనర్ల ఆత్మీయ సమ్మేళనం శుక్రవారం నగరంలోని ఫిలిం భవన్‌లో నిర్వహించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పలు బీఎస్‌ఎన్‌ఎల్ విభాగాల్లో పదవీ విరమణ పొందిన ఉద్యోగులు గత అనుభవాలను పంచుకున్నారు.

ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ నిరసన



ధర్నా చేస్తున్న విద్యుత్ ఉద్యోగులు, నాయకులు

గణేష్‌నగర్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): తెలంగాణ పవర్ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఎస్ఈ ఆపరేషన్ సర్కిల్ కార్యాలయం ఆవరణలో శుక్రవారం ఉద్యోగులు నిరసన తెలిపారు. ఉత్తర్‌ప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో విద్యుత్ సంస్థలను ప్రైవేటీకరణపై నేషనల్‌కో-ఆర్డినేషన్ కమిటీ ఆఫ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ అండ్ ఇంజనీర్స్ పిలుపు మేరకు భోజన విరామ సమయంలో కార్యక్రమం నిర్వహించారు. జేఏసీ కన్వీనర్ రత్నాకర్‌రావు, తెలంగాణ స్టేట్ పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ కార్యదర్శి సదానందం, సామ్య నాయక్, తెలంగాణ స్టేట్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్వామి, 1104 యూనియన్ వీరయ్య, 327 యూనియన్ శ్రీనివాస్, డిప్లమా అసోసియేషన్ సంపత్‌కుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మహాప్రదర్శనను విజయవంతం చేయండి



ప్రదర్శనలో నాయకులు, కళాకారులు

సుభాష్‌నగర్, జనవరి 31: హైదరాబాద్‌లో ఫిబ్రవరి 7న నిర్వహించనున్న 'లక్ష డప్పులు.. వేల గొంతుకలు' మహాప్రదర్శన విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి అనిల్ పిలుపునిచ్చారు. శుక్రవారం నగరంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద మహిళా డప్పుకళాకారులతో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ ఆయశాల సాధనలో భాగంగానే ఎస్సీ వర్గీకరణ కోసం పోరాటం చేస్తున్నామన్నారు. వర్గీకరణతో ఏ కులానికీ అన్యాయం జరగదన్నారు. కళానేత జిల్లా అధ్యక్షురాలు నక్క జ్యోతి మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ న్యాయమైనది కాబట్టే మొదటి నుంచి మద్దతు తెలుపుతున్నామన్నారు. కార్యక్రమంలో అంబాల ప్రభాకర్, బోయిని కొమురయ్య, బుత్కూరి కాంత, ఆవారు లత, దాసరపు భవానీ పాల్గొన్నారు.

భూమి రిజిస్ట్రేషన్ చేస్తే ఆత్మహత్యే శరణ్యం

● తహసీల్దారు కాళ్ల మీద పడి వేడుకున్న బాధితులు



తహసీల్దారు కార్యాలయం ఎదుట మాట్లాడుతున్న బాధితులు

గన్నేరువరం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): తమకు తెలియకుండా భూమిని రిజిస్ట్రేషన్ చేసుకునే ప్రయత్నాలు చేస్తున్నారని అలా జరిగితే మాకు ఆత్మహత్యే శరణ్యం అంటూ మండలకేంద్రంలోని తహసీల్దారు కార్యాలయం ఎదుట గుండ్లపల్లి గ్రామానికి చెందిన బేతెల్లి రాజు, అతని సోదరి జ్యోతి, తల్లి శ్యామల ఆవేదన వ్యక్తం చేశారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని గుండ్లపల్లి గ్రామానికి చెందిన బేతెల్లి నారాయణరెడ్డికి సంజీవరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వసంత ముగ్గురుసంతానం. ఆయన ఇద్దరు కుమారు లకు ఉమ్మడి ఆస్తిని సమానంగా పంపకాలు చేశాడు. చిన్నకుమారుడు శ్రీనివాస్‌రెడ్డి, అతనిభార్య గతంలో చనిపోయారు. శ్రీనివాస్‌రెడ్డి పేరున ఉన్న రెండు ఎకరాల 25గుంటల భూమిని కూతురు ప్రియాంక పేరు మీద పట్టా అయింది. కొన్ని సంవత్సరాలకు ఆమె కూడా చనిపోయింది. ఆమె పేరున ఉన్న ఆస్థిని శ్రీనివాస్‌రెడ్డి సోదరి దొమ్మాట వసంత తన పెద్దన్న సంజీవరెడ్డి కుటుంబసభ్యులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా తన పేరున భూమిని రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు సిద్ధమైంది. దీంతో సంజీవరెడ్డి కుమారుడు బేతెల్లి రాజు, అతని సోదరి జ్యోతి, తల్లి రిజిస్ట్రేషన్ చేయవద్దని వేడుకున్నారు. తమ అనుమతి లేకుండా రిజిస్ట్రేషన్ చేస్తే ఆత్మహత్యే శరణ్యమని ఎమ్మార్వో కాళ్ల మీద పడ్డారు. ఈ విషయంపై తహశీల్దారును వివరణ కోరగా.. బేతెల్లి రాజు, జ్యోతి, శ్యామల ఎవరో కూడా మాకు తెలియదు. తమకు తెలియకుండా భూమి వేరే వ్యక్తులపేరున రిజిష్ట్రేషన్ చేస్తారేమోనన్న అపోహతోనే వారు కార్యాలయం ఎదుట ఆందోళన చేసినట్లు తెలిపారు. దరఖాస్తు ఇస్తే విచారణ చేపడతామన్నారు.

సీమంతం గర్భిణులకు మధురమైన అనుభూతి



మాట్లాడుతున్న వెంకటేశ్వర్‌రావు

రామడుగు: సీమంతం గర్భిణులకు మధురమైన అనుభూతి అని లయన్స్‌క్లబ్ జిల్లా గవర్నర్ వెంకటేశ్వరరావు అన్నారు. గోపాల్‌రావుపేటలోని లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సెకండ్‌డిస్ట్రిక్ట్ వైస్‌గవర్నర్ మోర కేత బద్రేశం దంపతుల సౌజన్యంతో 20 మంది గర్భిణులకు చీర,సారెఅందించారు.

పోటీ పరీక్షలపై అవగాహన

హుజూరాబాద్‌రూరల్: మండలం లోని సింగాపూర్‌లోని వీఎస్ఆర్ డిగ్రీ కళా శాలలో టాస్క్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పోటీ పరీక్షలపై కౌసల్య సింగ్ అర్థమెటిక్, మెంటల్ ఎబిలిటి, రిజనీరింగ్ సబ్జెక్టుల్లో మార్కుల సాధనపై అవగాహన కల్పించారు.

బెల్ట్ షాపులపై చర్యలు తీసుకోవాలి

హుజూరాబాద్: మండలంలోని బెల్ట్ షాపులపై చర్యలు తీసుకోవాలని ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎక్సైజ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామాల్లో బెల్ట్‌షాపులు నడవడం వల్ల ప్రజలు తమజీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు.

ఘనంగా గద్దర్ జయంతి

హుజూరాబాద్:పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద గద్దర్ జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆయ న సేవలను కొనియాడారు.

ఉపాధ్యాయుడికి సన్మానం

కరీంనగర్ రూరల్: నేషనల్ ఎడ్యూకేషనల్ పాలసీ శిక్షణ తీసుకున్న సందర్భంగా కరీంనగర్ మండలం నగునూర్ జిల్లా పరిషత్ పాఠశాల ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు పల్నాటి శ్రీనివాస్‌ను ఎంఈవో రవీందర్ ఉపాధ్యాయులు శ్రీనివాస్‌ను సన్మానించారు.

ఎన్‌సీసీ బుక్ ఆవిష్కరణ

హుజూరాబాద్ రూరల్: మండలంలోని సింగాపూర్‌లోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో పనిచేస్తున్న ఎన్‌సీసీ అధికారి కల్లెం రవీంద్ర బాబు రచించిన ఎన్‌సీసీబుక్‌ను శుక్రవారం రాజ్యసభ మాజీసభ్యుడు, కళాశాల చైర్మన్ కెప్టెన్ లక్ష్మీకాంతారావు ఆవిష్కరించారు.

సన్మానం..

గంగాధర:మండలంలో పనిచేస్తున్న పీఆర్ ఏఈ రమేష్‌కు శుక్రవారం ఉద్యోగ విరమణ సన్మానం నిర్వహించారు. పీఆర్‌డీఈ రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



ఉత్సవమూర్తులను ఊరేగిస్తున్న నిర్వాహకులు

వీణవంక, జనవరి 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని మామిడాలపల్లిలో శ్రీవెంకటేశ్వరస్వామి 13వ వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం రెండోరోజు వైభవంగా కొనసాగాయి. స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయకమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

మున్సిపల్ కమిషనర్‌గా సమ్మయ్య

హుజూరాబాద్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ మున్సిపల్‌కమిషనర్‌గా ఎన్ సమ్మయ్య శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. మున్సిపల్ సిబ్బంది కమిషనర్ సమ్మయ్యకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు.



మున్సిపల్ కమిషనర్ సమ్మయ్యను సన్మానిస్తున్న సిబ్బంది

గయాసుద్దీన్ సేవలు మరువలేనివి: జడ్పీ డిప్యూటీ సీఈవో



గయాసుద్దీన్‌ను సన్మానిస్తున్న జడ్పీ డిప్యూటీ సీఈవో, ఎంపీడీవో, ఉద్యోగులు

హుజూరాబాద్‌రూరల్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ఎంపీడీవో కార్యాలయంలో 27ఏళ్లుగా నిస్వార్థంగా సేవలందించి ఉద్యోగవిరమణ చేసిన సయ్యద్ గయాసుద్దీన్ సేవలు మరువలేనివని జడ్పీ డిప్యూటీ సీఈవో పవన్‌కుమార్ అన్నారు. శుక్రవారం వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పట్టణంలోని మురాద్‌నగర్‌లో ఆయన మిత్రులు భారీ పూలదండతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో తూర్పాటి సునీత, తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగుల గెజిటెడ్, నాన్‌గెజిటెడ్ ఉపాధ్యాయులు పెన్షనర్లు, కార్మికుల జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ ముజాహిద్ హుస్సేన్, మిత్రులు మహమ్మద్ అఫ్సర్, మహమ్మద్‌సలీం, మహమ్మద్ జానీపాషా, మహమ్మద్ అబ్దుల్, ఏంప అజీజ్, మిర్జా అఫ్జల్‌బేగ్, మహమ్మద్ ముజారుద్దీన్, కాజాపాషా, సయ్యద్ ఫయాజుద్దీన్, అమీర్‌ఖాన్, మక్బూల్ హుస్సేన్, మక్సూద్, సలీం, నాజర్, ఖాద్రీ, సుధాకర్ తదితరులు ఉన్నారు.

కారు డ్రైవర్స్, ఓనర్స్ కార్యవర్గం

హుజూరాబాద్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ కార్‌డ్రైవర్స్, ఓనర్స్ అసోసియేషన్ కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సదానందం, గౌరవ అధ్యక్షుడిగా గందెశ్రీనివాస్, గౌరవ సలహాదారులుగా ప్రతాపశ్రీనివాస్, వెంకటస్వామి, ఉపాధ్యక్షులుగా కొలిపాక సాయిరాం, కొండూరి కిరణ్, కార్యదర్శిగా కందుల స్వామి, తదితరులు ఎన్నికయ్యారు

డీటీఎఫ్ మండలాధ్యక్షుడిగా రమేష్

శంకరపట్నం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో డీటీఎఫ్ డీటీఎఫ్ మండలకమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బొప్పరాజు రమేష్, ప్రధాన కార్యదర్శిగా గోపురాజిరెడ్డి, ఉపాధ్యక్షులుగా రమేష్, వసంత, కార్యదర్శులుగా కుమారస్వామి, శ్రీనివాస్, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా రామేశ్వర్‌రెడ్డి, జిల్లా కౌన్సిలర్స్‌గా రవీంద్రనాథ్, సమ్మిరెడ్డి, శివప్రసాద్, హుమేరా జబీన్ ఎన్నికయ్యారు.

విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలి: ఎమ్మెల్యే



క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

తిమ్మాపూర్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువు,క్రీడలపై దృష్టిసారించాలని ఎమ్మెల్యే కవ్వం పల్లి సత్యనారాయణ అన్నారు. శనివారం రామకృష్ణ కాలనీ లోగల వాగేశ్వరికాలేజ్ ఆఫ్‌ఫార్మసీ స్పోర్ట్‌మీట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హజరైమాట్లాడారు. కార్యక్రమంలోకళాశాల ప్రధానకార్యదర్శి గంద్రశ్రీనివాస్‌రెడ్డి, సంయుక్తకార్యదర్శి డి శ్రీనివాస రెడ్డి, డైరక్టర్లు పాల్గొన్నారు.